ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 65, పేజీలు - 08
మంగళవారం, సెప్టెంబర్ 1, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# 1000 రోజుల పాలనపై చర్చకు సిద్ధమా?



## అసెంబ్లీకి రాకపోతే కేసీఆర్ రాజీనామా చేయాలన్న సీఎం రేవంత్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతూ ఐటీ, సినిమా, విద్యా రంగాల్లో ప్రపంచంతో పోటీపడుతోందని, పెరిగే జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను క్యూర్ (సర్వీస్ సెక్టార్), ప్యూర్ (మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్), రేర్ (అగ్రికల్చర్ సెక్టార్) అనే వ్యూహాత్మక విభాగాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న అంబర్‌పేట ప్రాంతంలో రెండేళ్లలోనే ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని నిర్మించి ప్రారంభించామని, మూసీ వరదల సమస్యలకు ఇది శాశ్వత పరిష్కారమని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, 1000 ఎకరాల్లో కేసీఆర్, 100 ఎకరాల్లో కేటీఆర్, జన్వాడలో 50 ఎకరాల్లో కవిత ఫామ్‌హౌస్ కట్టుకున్నారని ఆరోపించారు. అంబర్‌పేటలో పదెకరాల్లో నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తున్నామని ప్రకటించారు. ఆక్రమణలకు గురైన బతుకమ్మ కుంటను పునరుద్ధరించామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రాను తీసుకువచ్చామని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవం అయిన రేషన్ కార్డు ఇవ్వాలని ఏనాడైనా ఆలోచించారా.? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు.

### కేసీఆర్ రక్షణ కోసం రూ.21 కోట్ల ఖర్చు.. కానీ ఫాంహౌస్ లోనే ఉంటాడు

ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ తన బాధ్యతలను పూర్తిగా విస్మరించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఆయన భద్రత, వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నప్పటికీ, కేసీఆర్ 1000 రోజులుగా అసెంబ్లీకి గానీ, ప్రజల్లోకి గానీ రాకుండా ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని అన్నారు. ప్రజల సొమ్ముతో కోటి రూపాయల పైగా జీతం, సదుపాయాలు పొందుతూ ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పదేళ్ల బీఆర్ఎస్ పాలన వర్సెస్ 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రత్యక్ష చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు.

2లో..

ఇరాన్ అధ్యక్షుడి పెజిష్కియాన్‌తో

# ప్రధాని మోదీ భేటీ

## - అమెరికాతో యుద్ధం తర్వాత తొలిసారి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కేక్‌లో జరుగుతోన్న షాంఘై కో-ఆపరేటివ్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరిలో అమెరికా- ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ ఇద్దరు నాయకుల మధ్య జరిగిన మొదటి ముఖాముఖి

2లో..

ఆదరించాల్సిన పుట్టినిల్లు

# బయటకు పంపేసింది

## - టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత కంటతడి

- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్‌లో టీఆర్ఎస్ నిర్వహించిన పాంచజన్య సభలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కన్నీటి పర్యంతం అయ్యారు. 'ఏం తప్పు చేశానని నన్ను తీహార్ జైల్లో పెట్టారు? నన్ను అన్యాయంగా జైల్లో పెట్టారని అప్పుడు మాట్లాడిన నాయకులు ఆ తర్వాత ఎందుకు మౌనంగా ఉన్నారు'అని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు.'4 ఏళ్లు సీబీఐ, ఈడీ నన్ను ఎంత ఇబ్బంది పెట్టిన ధైర్యం సడలలేదు. దారి తప్పలేదు. మీ నిజామాబాద్ బిడ్డ నిప్పు. నేను మొదటి రోజు నుంచి తప్పు చేయలేదని చెప్పాను. సుప్రీంకోర్టు కూడా

2లో..

## అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

### - సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌కు ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు రాబోతున్నాయి. అమెరికా, లండన్ వెళ్లకుండా మహానగరం నుంచే విదేశీ విద్య చదివే అవకాశం రానుంది. ఇటీవల లండన్, అమెరికా పర్యటనలో ప్రభుత్వం పలు యూనివర్సిటీలతో ఎంవోయూ చేసుకుంది. విదేశీ విద్యా సంస్థలతో

2లో..


# నల్లమల గిరుల నుండి పరుగులు పెట్టిన కృష్ణమ్మ

## - వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం - దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు

అమరావతి (ప్రశ్న న్యూస్) దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, ఫ్లోరైడ్, కరవుతో అలమటించిన ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత రాతను మార్చే చారిత్రక ఘటం ఆవిష్కృతమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలిదశను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. నల్లమల కొండలను తొలిచి కృష్ణా జలాలను తరలించే ఈ భగీరథ ప్రయత్నం ఎట్టకేలకు సాకారమైన నల్లమల సాగర్‌లో జలసిరిగా రూపాంతరం చెందింది. సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని వెలిగొండ ప్రాజెక్టు వద్ద ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ

2లో..



# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

## - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి,

2లో..

# ఎంపీలకు నిధులున్నా వినియోగంలో వెనుకడుగు


- ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు నామమాత్రమే - రూ.394 కోట్లు వస్తే ఖర్చయింది రూ.94 కోట్లే
- కోట్ల నిధులు, అభివృద్ధి పనులు మాత్రం శూన్యం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభ సభ్యులుగా ఎన్నికై రెండేళ్లు పూర్తవుతున్నా తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. కేంద్రం ఒక్కో ఎంపీకి ఏడాదికి రూ.5 కోట్ల చొప్పున కేటాయిస్తుండగా రాష్ట్రంలోని ఆరుగురు ఎంపీలు రెండేళ్లలో తమకు అందిన నిధుల్లో 10 శాతాన్ని కూడా ఖర్చు చేయలేదు. దేశవ్యాప్తంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల సగటు వినియోగం 75 శాతంగా ఉండగా తెలంగాణలో మాత్రం ఇది కేవలం 23 శాతంగా నమోదైంది. ఎంపవర్డ్ ఇండియన్ అనే స్వతంత్ర ప్రజా ప్రయోజన డేటా డ్యాష్‌బోర్డ్ వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణకు చెందిన 23 మంది ఎంపీలకు గత రెండేళ్లలో కేంద్రం

2లో..

## ముగిసిన మెస్సీ శకం

### - అంతర్జాతీయ కెరీర్కు గుడ్ బై



కృష్ణా జలాల దోపిడీపై

# సీఎం రేవంత్ రెడ్డి మౌనం

## - తెలంగాణకు తీరని ద్రోహమన్న హరీశ్ రావు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీటి దోపిడీకి పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి చేస్తున్న తీరని ద్రోహమని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా హరీశ్ రావు చేసిన పోస్టులో రాష్ట్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నీటి కేటాయింపులు

3లో..



# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌పై బిగ్ అప్డేట్

## - ముగిసిన లాటరీ.. 7340 ఫ్లాట్ల కేటాయింపులు

2లో..




## మూసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభం

### - మూసారాంబాగ్-అంబర్‌పేట మధ్య ట్రాఫిక్ సమస్యకు చెక్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలోని అత్యంత కీలకమైన ముసారాంబాగ్, అంబర్‌పేట ప్రాంతాలను కలుపుతూ మూసీ నదిపై రూ.52 కోట్ల వ్యయంతో నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మించారు. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడుతూ ఈ నూతన బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, వీహెచ్ సహా పలువురు నేతలతో కలిసి బ్రిడ్జిపై నడిచారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జీహెచ్ఎంసీ అధికారిక యంత్రాంగం అన్ని ముందగానే ఏర్పాట్లు పూర్తి చేసింది. ముసారాంబాగ్-అంబర్‌పేట హైలెవల్ బ్రిడ్జి ద్వారా ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య

2లో..

ప్రజాప్రశ్న



# 1000 రోజుల పాలనపై చర్చకు సిద్ధమా?

## 8.11 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను రూ.8.11 లక్షల కోట్ల అప్పుల్లో నెట్టి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించిందన్నారు. 5.5 లక్షల మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రతినెలా 1వ తేదీన లేదా 5వ తేదీకల్లా క్రమం తప్పకుండా జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రిటైర్మెంట్ బకాయిల కింద రూ.6,000 కోట్లు విడుదల చేశామని, ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని తెలిపారు. తమ 1000 రోజుల ప్రజా పాలనలో 72,000 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశాం. స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను స్థాపించామని చెప్పారు. ఉచిత విద్యుత్, రూ.20,617 కోట్ల రైతు రుణమాఫీ సహా వ్యవసాయ రంగానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిందని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. మహిళా సంఘాల రుణ వడ్డీ కింద రూ.2,100 కోట్లు చెల్లించడమే కాకుండా, వారిని బస్సులకు యజమానులుగా మారుస్తూ ఆర్టీసీకి అద్దెకు తిప్పే వెసులుబాటు కల్పించాం. పెట్రోల్ బంకుల నిర్వహణ, కోటి మంది మహిళలకు నాణ్యమైన ఇందిరమ్మ చీరల పంపిణీ చేశాం. హైటెక్ సిటీ వద్ద రూ.1,000 కోట్ల విలువైన స్థలంలో 'ఇందిరా మహిళా శక్తి స్టాల్స్' ఏర్పాటు చేయడం ద్వారా మహిళల ఆర్థిక బలాన్ని పెంచాం.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ఇళ్లను ఇంటి ఆడబిడ్డల పేరుతో మంజూరు చేస్తున్నాం. కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేసి రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతిపక్ష నాయకులు కూడా ఈ సన్న బియ్యాన్ని తింటూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. రూ.2,000 కోట్లతో నూతన ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నామని, త్వరలోనే ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రిని ప్రారంభించబోతున్నాం. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలకు కొండా లక్ష్మణ్, ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ వంటి తెలంగాణ ఉద్యమకారులు, మహనీయుల పేర్లను నామకరణం చేస్తూ వారి త్యాగాలను గౌరవిస్తున్నామని' సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

## బీసీలకు సముచిత స్థానం కల్పించాం

తమ 1000 రోజుల సంక్షేమ పాలనలో పేదలు, దళితులు, బీసీలకు పెద్దపీట వేశామని సీఎం ఉద్ఘాటించారు. సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహంతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న, నెక్లెస్ రోడ్డులో జ్యోతిబా పూలే విగ్రహాలను ప్రతిష్ఠించామని గుర్తుచేశారు. సామాజిక న్యాయంలో భాగంగా 1000 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించడమే కాకుండా, 1931 తర్వాత దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీసీ కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేసి కేంద్రానికి సవాల్ విసిరామని తెలిపారు. రాజకీయ పదవుల్లో బలహీన వర్గాల నాయకులకు, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించామని పేర్కొంటూ.. మహేష్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లను మంత్రులుగా, అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీగా నియమించామని ప్రస్తావించారు.

# ఇరాన్ అధ్యక్షుడి పెజిష్కియాన్‌తో ప్రధాని మోదీ భేటీ

భేటీ ఇదే. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు కానీ హర్మూజ్ జలసంధిలో ఇరాన్ దిగ్బంధనంపై ప్రధానంగా చర్చ జరిగి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది."కిర్గిజ్‌స్థాన్‌లో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ సదస్సు, షాంఘై ప్లస్ సదస్సులో పాల్గొనడానికి వెళ్లిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్ సమావేశమై చర్చలు జరిపారు" అని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. అమెరికా వ్యతిరేకంగా మద్దతును కూడగట్టేందుకు ఎస్‌సీఓ సదస్సుకు ఇరాన్ అధ్యక్షుడు హాజరవుతున్నారు. ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని తెగేసి చెప్పిన ఆయన ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని, కానీ ఎలాంటి దురాక్రమణకైనా దృఢ నిశ్చయంతో ప్రతిస్పందిస్తుందని స్పష్టం చేశారు. "దురాక్రమణదారులకు టెహ్రాన్ ధీటుగా ప్రతిస్పందిస్తుంది" అని నొక్కి చెప్పారు. అయితే, చర్చల వివాదాన్ని పరిష్కరించుకోడానికి పెజెష్కియన్ మొగ్గుచూపారు. నెల రోజుల్లోనే మొదటిసారిగా ఇరాన్‌కు చెందిన చిన్న దీవిపై అమెరికా జరిపిన సైనిక దాడి అనంతరం ఆయన నుంచి ఈ ప్రకటన వచ్చింది.పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరత అన్ని దేశాలకూ నష్టమేనని పేర్కొన్న ఆయన ఆర్థిక, భద్రతా లక్ష్యాలను సాధించడానికి అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "ఈ సమావేశం చాలా ముఖ్యమైనది. ఈ ప్రాంతంలోని మెజారిటీ నాయకులు హాజరవుతారు. ప్రపంచంలో కొన్ని అంతర్జాతీయ సంస్థలు ఒకే విధమైన వ్యవస్థను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో విభిన్న, స్వతంత్ర గొంతుకలు ప్రపంచ వేదికపై ఉన్నాయని నిరూపించేందుకు ఈ సమావేశం ఒక సంకేతంగా నిలుస్తుంది" అని ఆయన తెలిపారు.ఇదిలా ఉండగా, ఈ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా అర్మేనియా ప్రధాన మంత్రి నికోల్ పాషిన్యాన్‌ను కూడా ప్రధాని మోదీ కలిశారు. రక్షణ, ఆర్థిక, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్యతో సహా వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు సహా ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించి అర్మేనియాతో కలిసి పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలోనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కూడా మోదీ కలవనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ ప్రపంచ నోమాడ్ గేమ్స్ అధికారిక ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు.

# నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ

సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "తానే 30 ఏళ్ల క్రితం పునాది వేసిన ప్రాజెక్టును, మళ్లీ తానే స్వయంగా పూర్తి చేసి జాతికి అంకితం చేయడం తన జీవితంలో అత్యంత అరుదైన, చారిత్రక అదృష్టమని సగర్వంగా ప్రకటించారు. కరవు నేలపై కృష్ణమ్మ సరికొత్త చరిత్ర లిఖించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టు చరిత్ర చెబుతూ 1996లో తాను శంకుస్థాపన చేశానని వివరించారు. మూడు దశాబ్దాలపాటు ఎన్నో సవాళ్లు, ఆటంకాలు ఎదురైనప్పటికీ, చివరకు తొలి దశను పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు."నాడు నేను చేసిన సంకల్పం నేడు నల్లమల సాగర్‌లో కృష్ణమ్మ జలసిరిగా సాక్షాత్కరించింది. కొండలు అడ్డొచ్చినా సరే, వాటిని తొలిచి ముందుకు సాగాం. ఎన్నో సమస్యలు, సవాళ్లు వాటన్నింటినీ అధిగమించి ఈ కరవు నేలకు కృష్ణా జలాలను తీసుకొచ్చాం. ఇది మా ప్రభుత్వ కమిట్‌మెంట్" అని చంద్రబాబు పేర్కొన్నారు. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయల్దేరిన కృష్ణా జలాలు, మార్కాపురం చెన్నకేశవ స్వామి కొలువైన ఈ నేలకు హారతి ఇచ్చేలా నీటిని తీసుకురావడం వెనుక ఎంతో మంది కృషి ఉందని కొనియాడారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతల్లో బ్రహ్మాండమైన టీమ్ లీడర్‌గా వ్యవహరించిన మంత్రి నిమ్మల రామానాయుడుని ప్రజల సమక్షంలోనే అభినందించారు.వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను, ఇళ్లను త్యాగం చేసిన ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞత తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని 11 గ్రామాల ప్రజల త్యాగం వల్లే లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు వచ్చాయని కొనియాడారు. వారికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. నిర్వాసితుల సంక్షేమం, పునరావాసానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు పునరావాసం కోసం ఇప్పటివరకు భారీగా నిధులను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు నిర్వాసితుల కోసం మొత్తం రూ. 1,071 కోట్లు కేటాయించి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇటీవల నిర్వాసితులకు రూ. 165 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు అదనంగా రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తున్నట్లు సీఎం ప్రకటించారు.వెలిగొండ ప్రాజెక్టు బంగారు కొండగా మారబోతోందని ముఖ్యమంత్రి అభివర్ణించారు. కరవు, ఫ్లోరైడ్ మహమ్మారితో దశాబ్దాలుగా నలిగిపోయిన మార్కాపురం, పరిసర ప్రాంత ప్రజల దాహార్తిని, సాగునీటి అవసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టు అత్యంత కీలకం కానుంది. వెలిగొండ ప్రాజెక్టులో గరిష్టంగా 53 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సదుపాయం ఉందని సీఎం వెల్లడించారు. దటి దశ పనులను మొత్తం రూ.7,983 కోట్ల వ్యయంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. నీటి నిల్వ ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, తాగునీరు, సాగునీటి కొరత శాశ్వతంగా తీరుతుందని భావిస్తున్నారు. దేశంలోని, రాష్ట్రంలోని ప్రధాన నదులైన గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను పరస్పరం అనుసంధానించాలని చంద్రబాబు ప్రతిపాదించారు . ఈ నదుల అనుసంధానం ద్వారా నాలుగు దక్షిణాది రాష్ట్రాల్లోని కోట్ల ఎకరాల పంట పొలాలు సుసంపన్నం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టును రాబోయే పుష్కరాలకు ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఆ తర్వాతే మార్కాపురంలో కృష్ణా పుష్కరాలను అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ?

వెలిగొండ ప్రాజెక్టు పనులను వాస్తవంగా పూర్తి చేయకుండానే, కేవలం సినిమా సెట్టింగులు, తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేయడానికి వైసీపీ నేతలు ప్రయత్నించారని చంద్రబాబు మండిపడ్డారు. ఈ విలువైన ఐదేళ్ల కాలాన్ని వారు పూర్తిగా నిర్లక్ష్యం చేసి గాలికొదిలేశారని, వారి ఫేక్ ప్రచారాలను చూస్తే ఆవేదన కలుగుతోందని అన్నారు. 2024 ఎన్నికల తర్వాత రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడిందని, అభివృద్ధి పథంలో మళ్లీ ముందడుగు పడిందని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ, రాబోయే కాలంలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తిగా అందుబాటులోకి తెస్తామని సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2028 నాటికి వెలిగొండ ఫేజ్-2 పనులను కూడా పూర్తిగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కరవును తరిమికొట్టి, వెలిగొండను నిజమైన బంగారు కొండగా మార్చే వరకు కూటమి ప్రభుత్వం విశ్రమించదని స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

ఒప్పందాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. వివిధ యూనివర్సిటీలతో జరిగిన ఒప్పందాలు, చర్చలను అధికారులు సీఎంకు వివరించారు. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య, యూనివర్సిటీ ఆఫ్ లండన్ భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధులతో జరిగిన చర్చలపై చర్చించారు.ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ కోర్సులను జరగనున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులతో కూడా చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి.

## భవిష్యత్తులో మరిన్ని ఒప్పందాలు

అమెరికా పర్యటనలో నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశమై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్తులో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్జీనియా టెక్ రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన, భవిష్యత్తు ఉద్యోగాలకు ఉపయోగపడే విద్యా విధానాలను తీసుకురావడంపై సహకరించనుంది.హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటు కసరత్తును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటుతో పాటు.. సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి తెలంగాణ రైజింగ్ బృందం పర్యటన పెద్ద బలం ఇచ్చిందని సీఎం అన్నారు.

## విదేశీ విద్య కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

తెలంగాణ యువత, పిల్లలకే కాకుండా దేశంలోని విద్యార్థులకు కూడా ప్రపంచస్థాయి విద్య అందేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు తానే నాయకత్వం వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ విద్యాసంస్థలు, క్రీడా సదుపాయాలు రాష్ట్ర అభివృద్ధిపై చూపే ప్రభావంపై ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## మరిన్ని జీసీసీల రాక

ఇప్పటికే నాలెడ్జ్ ఎకానమీలో కీలక స్థానంలో ఉన్న హైదరాబాద్, గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే మరిన్ని జీసీసీలు, కంపెనీలు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచస్థాయి విద్యాసంస్థల స్వల్పకాలిక కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను నవంబరు నుంచి ప్రారంభించనున్నట్లు ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఛైర్‌పర్సన్ శాంతికుమారి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌కు అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేస్తామని సీఎం సలహాదారుడు రామకృష్ణారావు తెలిపారు.?

# మూసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభం

తీరుతుంది. ఈ ప్రాజెక్టును ఇంజనీరింగ్ విభాగం 2 ప్రధాన భాగాలుగా రూపకల్పన చేసి నిర్మిస్తోంది. అందులో భాగమైన ముసారాంబాగ్ వద్ద ఉన్న ఎడమవైపు (డౌన్ స్ట్రీమ్) వంతెన నిర్మాణం ఇప్పటికే పూర్తయింది.

## వాకర్స్ కోసం ఫుట్‌పాత్

ఈ నూతన వంతెనపై పాదాచారుల భద్రత కోసం 3.5 మీటర్ల వెడల్పుతో ప్రత్యేకం ఫుట్‌పాత్‌ను నిర్మించారు. అలాగే అప్రోచ్ రోడ్డు, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులన్నీ పూర్తికావడంతో వాహనదారులకు విజిబిలిటీ మెరుగైంది. ప్రస్తుతం వంతెన కుడివైపు భాగానికి సంబంధించిన నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతుండటంతో, దానిని వచ్చే ఏడాది నాటికి పూర్తి చేయాలని అధికారులు డెడ్ లైన్ ఫిక్స్ చేశారు. ఈలోగా నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ముందుగా పూర్తయిన ఎడమవైపు బ్రిడ్జిపై నుంచే వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నారు.

## పాత బ్రిడ్జికి 10 మీటర్ల ఎత్తులో కొత్త బ్రిడ్జి

గతంలో మూసీ నదిపై ఉన్న పాత లో-లెవల్ బ్రిడ్జి స్థానంలో దానికి దాదాపు 10 మీటర్ల (32 అడుగులు) అదనపు ఎత్తులో ఈ కొత్త వంతెనను నిర్మించారు. జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి ఒకేసారి 1.5లక్షల క్యూసెక్కుల మేర వరద నీళ్లు విడుదల చేసినప్పటికీ, ఈ కొత్త బ్రిడ్జి ఆ నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా నిర్మించారు. రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగదని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. వర్షాకాలంలో మూసీకి వరద వచ్చిన ప్రతిసారి పాత తక్కువ ఎత్తు వంతెన మునిగిపోయి, అంబర్‌పేట-ముసారాంబాగ్ మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

## శంకుస్థాపన చేసిన బీఆర్ఎస్

ఈ ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబరు 24న ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. అయితే తరువాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, ఆ తర్వాత 2024, 2025 సంవత్సరాల్లో వచ్చిన మూసీ వరద ప్రవాహాల వల్ల నిర్మాణ పనులకు కొంతకాలం ఆటంకం ఏర్పడి ఆలస్యమైంది. అన్ని అవరోధాలను అధిగమించి ఎట్టకేలకు ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో స్థానికులులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌పై బిగ్ అప్డేట్

### - ముగిసిన లాటరీ.. 7340 ఫ్లాట్లు కేటాయింపులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అవుటర్ రింగ్ రోడు పరిధిలో ఉన్న అల్పాదాయ వర్గాల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో 7340 మందికి ఇండ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయ్యింది. నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన లాటరీ ప్రక్రియ సోమవారం నాడు ముగిసింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగస్టు 28 వ తేదీ నాడు లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో మినహాయించి మిగిలిన 15 నియోజకవర్గాల్లో 480 ఇండ్ల చొప్పున కేటాయించారు. కంటోన్మెంట్ పరిధిలో తొలివిడతలో 140 ఇండ్లను మాత్రమే నిర్మిస్తున్నందున ఆ సంఖ్యలోనే ఇండ్లను కేటాయించారు.

## 7340 ఇండ్లకు 60,720 దరఖాస్తులు

ప్రతి నియోజకవర్గంలోనూ, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారికే ఇండ్లు కేటాయించాలన్న ఉద్దేశ్యంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టి, హౌసింగ్ బోర్డు ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఇలా అందుబాటులో ఉన్న స్థలాల్లో ప్రతిపాదించిన మొత్తం 7340 ఇండ్లకు గాను, 60,720 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరిశీలనలో అర్హులైన వారి పేర్లతో పూర్తి పారదర్శకంగా,నిష్పాక్షపాతం గా, బహిరంగంగా లాటరీ నిర్వహించి ఇండ్లను కేటాయించారు. ఆగస్టు 28 వ తేదీ నుంచి 31 వరకు ఆయా నియోజకవర్గాల్లోనే దరఖాస్తుదారులు, అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ జరిగింది. లాటరీ నిర్వహణ ప్రక్రియపై దరఖాస్తుదారుల్లో సంతృప్తి వ్యక్తం కాగా, లాటరీ ద్వారా ఇండ్లు పొందిన కుటుంబాల్లో పండుగ సీజన్ ను మరింత సంతోషాలను నింపింది. అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 16 నియోజకవర్గాల్లో ఇండ్ల కేటాయింపు పూర్తి కాగా 4 నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా త్వరలోనే వెలువడనున్నది.

## ఆన్ లైన్ లో వివరాలు.. అభ్యంతరాల స్వీకరణ

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో లాటరీ ద్వారా ఇండ్లు పొందిన వారి వివరాలన్నిటినీ అధికారిక వెబ్ సైట్లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. ఇలా ఎంపికైన వారు మీద ప్రజలు తమ అభ్యంతరాలను తెలియచేసే అవకాశం కల్పిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఈ అభ్యంతరాలను కూడా వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లోనే సమర్పించవచ్చున్నారు. అలాగే లాటరీలో ఎంపికైన దరఖాస్తు దారుల వివరాలను పరిశీలించడానికి అధికారుల బృందం క్షేత్ర స్థాయి పరిశీలనను చేపడుతుందని ఆయన వెల్లడించారు. పూర్తి పారదర్శకంగా, అర్హులైన వారికే ఇండ్లు లభించేలా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. లాటరీలో ఇండ్లు వచ్చిన వారు క్షేత్ర స్థాయిలో తమ ఇండ్లకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు.

# ఆదరించాల్సిన పుట్టినిల్లు బయటకు పంపేసింది

అదే విషయాన్ని తేల్చింది. దేశంలో ఎప్పుడు లేని విధంగా సీబీఐ ఆఫీసర్ మీదనే ఎంక్వైరీ వేయాలని కోర్టు తీర్పు చెప్పింది'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పుకొచ్చారు.

## పబ్బతి పట్టి అడుగుతున్నా ఆశీర్వదించండి

'లిక్కర్ స్కాం కేసులో తనపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తే ఆడబిడ్డ కష్టాల్లో ఉంటే అక్కున చేర్చుకోవాల్సింది పోయి కర్కశంగా నన్ను బయటకు పంపారు. నన్ను ఎందుకు తీసేశారో అర్థం కావటం లేదు. సొంతూరుకు రావటంతో ఆవేదనతో ఆపుకుందామనుకున్న కన్నీళ్లు వస్తున్నాయి. అలాగని నన్ను పిరికిదాన్ని అని మాత్రం అనుకోవద్దు. ఆడబిడ్డకు బాధ ఉంటే కన్నీళు వస్తాయి'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు.'తెలంగాణకు ఇంకా చాలా చేయాల్సి ఉంది. పదవుల కోసం కాకుండా పంతం పట్టి ఇందూరు గడ్డ వేదికగా మీ ముందుకు వస్తున్నా. కష్టాల్లో మా అమ్మ ఇళ్లు నిర్దాక్షణ్యంగా వెళ్లగొడితే మా అత్తమామాలు కన్న కూతురిలా కడుపులో పెట్టి చూసుకున్నారు. అమ్మ వెళ్లగొడితే మీ కోసం వచ్చి నన్ను ఆశీర్వదించమని పబ్బతి పట్టి అడుగుతున్నా'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంది

'రాష్ట్రంలో ఇప్పటికే ఇన్ని పార్టీలు ఉండగా మళ్లీ కొత్తగా పార్టీ ఎందుకు అని మీకు అనిపించవచ్చు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేపటితో వెయ్యి రోజులు అవుతుంది. ఇన్ని రోజుల్లో ఒక్క హామీ అయినా సరిగా అమలు చేసిందా?'అని కవిత ప్రశ్నించారు. 'రైతు భరోసా ఆగమైంది, రైతులు ఆగమయ్యారు. ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ఈ ముఖ్యమంత్రి ఎన్నికలు వస్తే ఓట్లు వేస్తాడు. ఆ తర్వాత తిట్లు మొదలుపెడతాడు. కానీ ప్రజల కోసం ఒక్క మంచి పని కూడా ఆయన చేయలేదు. దొంగ హామీలతో గద్దెనెక్కిన వాళ్లను మనం నిలదీయాలా వద్దా?. కాంగ్రెస్ పార్టీని నిలదీయాల్సి బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంది?'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు.

## అత్తమామలు కడుపులో పెట్టుకుని చూశారు

'సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదని చెప్పుకొచ్చారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పుకొచ్చారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు 'కవిత సీఎం.. సీఎం' అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పుకొచ్చారు. అందుకే కొత్త పార్టీ పెట్టానని చెప్పుకొచ్చారు.తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని కల్వకుంట్ల కవిత చెప్పుకొచ్చారు.

## నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను

ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానని అన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కవిత కోరారు.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు.

## 33శాతం పచ్చదనాన్ని అమలు చేయాలి

అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.

## 2047 నాటికి భూభాగంలో 50 శాతం పచ్చదనం సాధించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# ఎంపీలకు నిధులున్నా వినియోగంలో వెనుకడుగు

రూ.394 కోట్లను కేటాయించింది. ఇందులో ఇప్పటివరకు సుమారు రూ.94 కోట్లను మాత్రమే వినియోగించినట్లు నమోదైంది. ఈ నిధులతో 2,347 అభివృద్ధి పనులు పూర్తయినట్లు డేటా పేర్కొంది.ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముందున్నారు. గత రెండేళ్లలో తనకు కేటాయించిన రూ.28 కోట్లలో 56 శాతం నిధులను ఆయన వినియోగించినట్లు డేటా చెబుతోంది.

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ 49 శాతం, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర 48 శాతం నిధులను ఖర్చు చేసినట్లు నమోదైంది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు అత్యధికంగా రూ.32 కోట్ల నిధులు కేటాయించగా అందులో రూ.3.47 కోట్లు మాత్రమే వినియోగించినట్లు డ్యాష్‌బోర్డ్ పేర్కొంది. ఇది మొత్తం కేటాయింపులో సుమారు 11 శాతం. రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ పదవీకాలం ఇటీవలే ప్రారంభమైన నేపథ్యంలో ఆయన ఖాతాలో ఇప్పటివరకు ఎలాంటి వ్యయం నమోదుకాలేదు.ఆరుగురు ఎంపీలు రెండేళ్లలో తమకు కేటాయించిన నిధుల్లో 10 శాతంలోపే ఖర్చు చేసినట్లు డేటా చెబుతోంది. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రూ.14.70 కోట్లలో రూ.1.11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి 2.08 శాతం, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బి.పార్థసారథి రెడ్డి 2.43 శాతం నిధులను మాత్రమే వినియోగించినట్లు నమోదైంది.

తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రుల విషయంలోనూ పోర్టల్ డేటాలో తక్కువ వినియోగం నమోదైంది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి రూ.14.70 కోట్లు కేటాయించగా రూ.47.50 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ రూ.17.27 కోట్లలో రూ.6.50 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.అయితే కిషన్‌రెడ్డి కార్యాలయం ఈ గణాంకాలను ఖండించింది. మార్చి 2026 నాటికి సుమారు రూ.14 కోట్లలో రూ.10 కోట్ల విలువైన పనులకు సిఫారసులు చేశామని, వాటిలో రూ.8.90 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపింది. జిల్లా యంత్రాంగం పనులు పూర్తి చేసి, వినియోగ ధ్రువపత్రాలను కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుందని పోర్టల్‌లో వివరాలు అప్‌డేట్ కాకపోవడం వల్లే తక్కువ వినియోగం కనిపిస్తోందని పేర్కొంది. బండి సంజయ్ కార్యాలయం కూడా ఇదే తరహా వివరణ ఇచ్చింది. 2019 నుంచి మంత్రి సుమారు రూ.30 కోట్ల విలువైన పనులకు సిఫారసు చేశారని, గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కేవలం రూ.88 లక్షల బ్యాలెన్స్ మాత్రమే ఉన్నట్లు పేర్కొంది.నిధుల వినియోగం తక్కువగా ఉండటానికి ఎంపీల కార్యాలయాలు మరో కారణాన్ని కూడా చెబుతున్నాయి. వివిధ అభివృద్ధి పనులకు ఎంపీలు సిఫారసు లేఖలు ఇచ్చినప్పటికీ జిల్లా కలెక్టర్లు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంలో ఆలస్యం జరుగుతోందని అంటున్నారు. జీహెచ్ఎంసీ, గ్రామీణ నీటిపారుదల సంస్థలు, ఇతర అమలు సంస్థలు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో పలు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు.

# భూములిస్తే.. తిరిగి ప్లాట్లు

- అమరావతి రెండో విడత భూసమీకరణలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు
- భూముల సరిహద్దులు క్షేత్రస్థాయిలో చూపించాలి: కలెక్టర్
- రైతులు సహకరిస్తే వెంటనే పనులు: సాయికాంత్‌వర్మ పెదపరిమిలో భూసమీకరణపై గ్రామసభ



గుంటూరు(ప్రశ్న న్యూస్) అమరావతి రాజధాని రెండో విడత భూసమీకరణలో భూములు ఇచ్చే రైతులకు నిబంధనల ప్రకారం రిటర్నబుల్ ప్లాట్లు అందజేస్తామని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్‌వర్మ తెలిపారు. భూసమీకరణకు రైతులు ముందుకొచ్చి సహకరిస్తే రాజధాని అభివృద్ధి పనులను వేగంగా చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.తాడికొండ మండలం పెదపరిమిలో సోమవారం నిర్వహించిన భూసమీకరణ గ్రామసభలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్‌కుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.అమరావతిని ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. భూసమీకరణకు రైతులంతా సహకరించాలని కోరారు.ఎక్కువ మంది రైతులు తమ భూములను భూసమీకరణకు అందిస్తే అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.భూసమీకరణ ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను అందించడంతో పాటు క్షేత్రస్థాయిలో భూములను చూపించాలని కలెక్టర్ సూచించారు. భూముల వాస్తవ సరిహద్దులను అధికారులు పరిశీలించేలా సహకరించాలని కోరారు. దీంతో భూమి విస్తీర్ణం, సరిహద్దుల ఆధారంగా రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులో స్పష్టత ఉంటుందని తెలిపారు.గ్రామసభ అనంతరం పెదపరిమిలో రైతుల సందేహాల నివృత్తికి కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వెల్లడించిన సమస్యలు, సందేహాలను ఆయన స్వయంగా విని పరిష్కరించారు. భూములకు సంబంధించిన పత్రాలను కూడా కొందరు రైతులకు అందజేశారు.కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సు మర్డర్ కేసు

- కోలకతా ఆర్జీకర్ ఆస్పత్రి ఘటన తరహాలో...
- హైదరాబాద్ లోని ప్రైమ్ కేర్ హాస్పిటల్ ఘటన
- సంచలన విషయాలు వెలుగులోకి

**రంగారెడ్డి** హైదరాబాద్లోని ప్రైమ్ కేర్ హాస్పిటల్కు చెందిన నర్సు హత్య కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిగా బీహార్కు చెందిన సనావుల్లా ఖాన్ను గుర్తించారు. ఘటనాస్థలికి సమీపంలోని మెకానిక్ షాపులో పనిచేస్తున్న వ్యక్తే నిందితుడు కావడం కలకలం రేపుతోంది. మెకానిక్ షాపు వెనుక భాగంలోనే నర్సుల హాస్టల్ ఉండటం దర్యాప్తులో కీలకంగా మారింది. శుక్రవారం రాత్రి బాధితురాలు హాస్టల్ గదిలో ఒంటరిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గదికి ఉన్న కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో, అదే మార్గం ద్వారా నిందితుడు లోపలికి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నారు. బాధితురాలిపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు ప్రాథమిక దర్యాప్తులో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య అనంతరం మృతదేహంపై కూడా లైంగిక దాడి జరిగి ఉండవచ్చన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత కూడా నిందితుడు ఏమాత్రం అనుమానం రాకుండా సాధారణంగా మెకానిక్ షాపు వద్దే తిరిగినట్లు సమాచారం. అర్ధరాత్రి సమయంలో మెకానిక్ షాపు యజమానికి ఫోన్ చేసి పెట్రోల్ కావాలని అడగడం కూడా పోలీసుల అనుమానాలకు దారితీసింది. పోలీసులు డాగ్ స్క్వాడ్తో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కూడా నిందితుడు అక్కడే ఉన్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి, అక్కడ ఏం జరిగిందంటూ ప్రశ్నిస్తూ తనపై అనుమానం రాకుండా నటించినట్లు సమాచారం. అయితే జాగిలం నిందితుడు పనిచేస్తున్న మెకానిక్ షాపు వద్దకు వచ్చి ఆగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనంతరం సీసీటీవీ ఫుటేజ్ను పరిశీలించిన పోలీసులు సనావుల్లా ఖాన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు హత్యకు సంబంధించిన విషయాలను వెల్లడించినట్లు పోలీసు వర్గాల సమాచారం.

## రైతుల సమస్య పరిష్కారానికి
# ముందుకొొచ్చిన తుగ్గలి నవీన్ రెడ్డి

- సొంత ఖర్చుతో పొలాలకు వెళ్లే చెరువు వద్ద ముళ్ల పొదలు తొలగింపు.
- తుగ్గలి గ్రామంలో రైతుల సమస్యకు తక్షణ పరిష్కారం.



**తుగ్గలి:** మండల కేంద్రమైన తుగ్గలి గ్రామంలోని చెరువు పరిసర ప్రాంతంలో పొలాలకు వెళ్లే రహదారికు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదల కారణంగా రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ రైతులు బీజేపీ నాయకుడు తుగ్గలి నవీన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన తుగ్గలి నవీన్ రెడ్డి తన సొంత ఖర్చుతో జెసిబి ద్వారా చెరువు వద్ద ఉన్న ముళ్ల పొదలను తొలగించే పనులను సోమవారం రోజున చేపట్టారు.దీంతో రైతులు,గ్రామ ప్రజలు చెరువు పరిసర ప్రాంతాల్లో సులభంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం ఏర్పడింది.రైతులకు చిన్న ఇబ్బంది కూడా ఉండకూడదని,రైతుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత మేరకు తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తుగ్గలి నవీన్ రెడ్డి తెలిపారు.ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను సేవా దృక్పథంతో కొనసాగిస్తానని చెప్పారు.చెరువు కట్ట వద్ద పొలాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్ళ పొదలను తొలగించడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టైలర్ శ్రీను,పాల లోకన్న,ఆటో శేఖర్,జెసిబి రమేష్, ఉప్పర రాముడు,గుజ్జల వెంకటరాముడు,చెరువు చెన్నకేశులు,అరవ రామాంజినేయులు,తపాల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకంలో
# భారీ కుంభకోణం ఉంది

**- ఎమ్మెల్యే మాధవరం**

**కూకట్ పల్లి** వంద రోజులో ఆరు గ్యారెంటీల 420 సంక్షేమ పథకాలు అందిస్తామని వెయ్యి రోజులైనా ఏమీ జరగలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి గద్దెనెక్కరు. నాలుగు వేల పెన్షన్లు, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని తెలంగాణ ప్రజలను మోసం చేశారు. వంద రోజుల్లో సంక్షేమ పథకాలు అందిస్తామని వెయ్యి రోజులైన జాడ లేదు. బిఆర్ఎస్ పార్టీ అధినేత పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుండి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుపుతున్నామని అన్నారు. కేసీఆర్ శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు రంగులు వేసుకుంటూ రిబ్బన్లు కట్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి . కెసిఆర్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఉచితంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఏమో 5 లక్షల రూపాయలు కడితే ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని అంటున్నాడు. నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లుకు ఐదు లక్షల రూపాయలు కట్టగలరా..? ఒకే ఇంట్లో భార్యకు డబుల్ బెడ్ రూం వస్తె భర్తకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా కేటాయించారు. ఒకే ఇంట్లో ఇద్దరికి ఇండ్లు ఎలా కేటాయిస్తారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భారీ కుంభకోణం ఉంది. ప్రజలకు మరోసారి మోసం చేయడానికి రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధం అయింది. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన పెన్షన్లు ,తులం బంగారం బాకీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలి. అబద్ధాల హామీలతో గద్దెనెక్కినటువంటి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇందిరమ్మ ఇండ్లలో స్థానిక ఎమ్మెల్యేను పిలవకుండానే లాటరీ తీస్తున్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వన్నీ ప్రశ్నిస్తే ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఇచ్చేవరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు.

# చదువు రాలేదని విద్యార్ది ఆత్మహత్య



**రంగారెడ్డి** మియాపూర్లో విషాదం జరిగింది. చదువు రావడం లేదనే మనస్తాపంతో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మల్లికార్జున (16) మియాపూర్ సుభాష్ చంద్రబోస్ నగర్ లో తల్లి తండ్రులతో కలిసి ఉంటున్నాడు. తండ్రి పెయింటర్ గా పనిచేస్తున్నాడు. చదువు సరిగా రావడం లేదనే మనస్తాపంతో ఇంట్లో ఆత్మహత్య కు పాల్పడ్డాడు. కుటుంసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

# మోత్కూరులో యూత్ ఎంపవర్మెంట్ ఫెస్ట్

**- అక్టోబరు 18న నిర్వహణ: పసాలా ఫౌండేషన్**

యువతలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 18న యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ యూత్ ఎంపవర్మెంట్ ఫెస్ట్ను ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా, సహ వ్యవస్థాపకుడు అర్జున్, సీఈఓ గోకుల్ రమణ, కార్యక్రమ డైరెక్టర్ రాజాలు యూత్ ఎంపవర్మెంట్ ఫెస్ట్ పోస్టర్ను ఆవిష్కరించారు. పిల్లలు, యువత, మహిళలు, రైతులు, వృద్ధులు అనే ఐదు ప్రధాన రంగాల్లో విద్య, సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. యూత్ ఎంపవర్మెంట్ ఫెస్ట్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో స్పోర్ట్ ఎక్స్‌పో
# ఇండియా 2026 ప్రారంభం

- హైటెక్స్‌లో రెండు రోజుల ప్రదర్శన..
- 50కి పైగా ఎగ్జిబిటర్లు, లైవ్ స్పోర్ట్స్ పోటీలు..
- క్రీడాకారులు, బ్రాండ్లు, ఫిట్‌నెస్ కమ్యూనిటీలకు వేదికబి
- స్పోర్ట్స్, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన
- స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా రెండు రోజుల ప్రదర్శన

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. హైటెక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో తయారీదారులు, ప్రముఖ బ్రాండ్లు, డిస్ట్రిబ్యూటర్లు, పరిశ్రమ నిపుణులు, స్పోర్ట్స్ కమ్యూనిటీలు, వినియోగదారులు ఒకే వేదికపైకి వచ్చారు. ఈ 9వ ఎడిషన్ స్పోర్ట్ ఎగ్జిబిషన్‌ను హైటెక్స్ డైరెక్టర్ కున శంకర్, ఎన్‌ఎండీసీ డైరెక్టర్ పర్సనల్ కృష్ణ కుమార్ ఠాకూర్ , హైదరాబాద్ రన్నర్స్ రేస్ డైరెక్టర్ రాజేష్ వెట్చా కలిసి ప్రారంభించారు.స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా 2026లో 50కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. స్పోర్ట్స్, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్ విభాగాలకు సంబంధించిన ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించడంతో పాటు లైవ్ స్పోర్ట్స్ టోర్నమెంట్లు, వివిధ క్రీడా పోటీలు, డెమోన్స్ట్రేషన్లు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మీడియాతో హైటెక్స్ డైరెక్టర్ కున శంకర్ మాట్లాడుతూ.. స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా క్రీడా రంగంలోని బ్రాండ్లు, వినియోగదారులు నేరుగా అనుసంధానం అయ్యే వేదికగా అభివృద్ధి చెందుతోందన్నారు. క్రీడాకారులు, కోచ్‌లు, ఫిట్‌నెస్ ఔత్సాహికులు, పరిశ్రమ నిపుణులు పరస్పరం కలుసుకుని, ఆలోచనలు పంచుకోవడంతో పాటు కొత్త ఉత్పత్తులు, ఆవిష్కరణలను ఈ ఎక్స్‌పో కల్పిస్తోందని తెలిపారు. క్రీడలకు పూర్తిగా అంకితమైన వేదికగా స్పోర్ట్ ఎక్స్‌పోను రూపొందించాం. ప్రతి సంవత్సరం క్రీడాకారులు, నిపుణులు, బ్రాండ్లు, సంస్థలు, క్రీడాభిమానులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నాం. స్పోర్ట్ ఎక్స్‌పో కేవలం ఉత్పత్తుల ప్రదర్శనకే పరిమితం కాకుండా, పోటీలు, డెమోన్స్ట్రేషన్లు, సెమినార్లు వంటి కార్యక్రమాలు కొనసాగుతాయని కున శంకర్ తెలిపారు.హైదరాబాద్ మారథాన్‌కు కర్టెన్ రైజర్‌గా స్పోర్ట్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, దేశంలో రెండో అతిపెద్ద మారథాన్‌గా పేరొందిన హైదరాబాద్ మారథాన్‌కు 25,000 మందికి పైగా సందర్శకులను ఈ వేదిక ఆకర్షిస్తోందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను ప్రముఖ క్రీడా, ఫిట్‌నెస్ ఈవెంట్లకు వేదికగా మరింత బలోపేతం చేయడంలో స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా 2026 కీలకంగా నిలుస్తుందన్నారు.

# పదవి విరమణ ప్రతి ఒక్కరికి సర్వసాధారణం



**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలో ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు దీర్ఘకాలంగా ఏపీఎస్ఆర్టీసీ సంస్థకు విశిష్ట సేవలు అందించి, తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి సంస్థకు 40 సంవత్సరాలు సేవనందించి 31/08/2026 నాడు పదవీ విరమణ పొందుతున్న వి . నల్లన్న సీనియర్ అసిస్టెంట్ (పి) గారికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ హృదయ పూర్వక అభినందనలు మరియు పదవీ విరమణ శుభాకాంక్షలు పూలదండలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. , ఈ సందర్భంగా డిపో మేనేజర్ మదిలేటి నాయుడు మాట్లాడుతూ నల్లన్న ఆఫీసులో తన పని తాను చేసుకుంటూ వెళ్లేవాడని, మంచి స్వభావం గల వ్యక్తి పదవి విరమణ పొందడం బాధాకరమైన విషయమే అయినప్పటికీ పదవి విరమణ తప్పదు కాబట్టి తన శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని కోరారు. జూలైలో రిటైర్డ్ అయినటువంటి విజయ్ కుమార్ (అకౌంటెంట్) మల్లన్న గురించి మాట్లాడారు. ఎన్.ఎం. యు. ఏ డిపో చైర్మన్ ఎన్ పి ఎం సాహెబ్ మాట్లాడుతూ మల్లన్న సేవలు చిరస్మరణీయమని, మీ భవిష్యత్తు ఆనందంతో గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యనిర్వాహక అధ్యక్షులు గంగన్న (ఎల్.హెచ్) డిపో అధ్యక్షులు ఎస్ ఎం రఫిక్, కెఎంకె రావు, డిపో గ్యారేజీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాల దోపిడీపై
# సీఎం రేవంత్ రెడ్డి మౌనం

లేకున్నా, వరద జలాలు రాకున్నా, వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు మండిపడ్డారు. 'ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు.'ఒకవైపు కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యదేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ ఇప్పుడు వెలిగొండ!'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు మండిపడ్డారు. 'తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు?. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ధ్వజమెత్తారు.'తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు?. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కెఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం.తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి?. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటనే స్పందించాలి. కెఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ధ్వజమెత్తారు.

## విఘ్నేశ్వరుని ఆలయ ప్రారంభోత్సవంలో
# ముక్కా వరలక్ష్మి

**చిట్వేలి** పెనగలూరు మండలం ఓబిలి బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ విఘ్నేశ్వరుని ఆలయ ప్రారంభోత్సవంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు, బీసీ కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. గ్రామాల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సామాజిక సేవా భావం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఆమె కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# ఖనిజ నిక్షేపాలను తొక్కిపెట్టి కార్మికుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

**చిట్వేలి** ప్రపంచ ప్రసిద్ధి చెందిన మంగంపేట ఏపీఎండీసీ బైరటీస్ మైనింగ్ విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్రమైన కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్, డిఆర్‌యుసిసి సభ్యులు, తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగంపేటలో ఆయన మాట్లాడుతూ మంగంపేటలో వేలాది కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు, ఫుల్లరీన్ ఉన్నాయని గతంలోనే అనేక పరిశోధనలు స్పష్టం చేశాయని గుర్తుచేశారు. 2005-2008 కాలంలో 'జిఆర్‌టిసి' ద్వారా, ఆపై 2023లో భువనేశ్వర్‌కు చెందిన సంస్థ ద్వారా, అలాగే ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ద్వారా వైట్ సేల్, బ్లాక్ సేల్ మినరల్స్‌పై అధ్యయనాలు జరిగినట్లు తెలిపారు. ఏపీఎండీసీ సీపీఓ కూడా ఈ నిక్షేపాలు ఉన్నట్లు గతంలో ధృవీకరించారన్నారు. 2026 జనవరి 1 నుండి మార్చి 31 వరకు కేవలం మూడు నెలల వ్యవధిలోనే 8,73,159 క్యూబిక్ మీటర్ల వ్యర్థ మట్టితో మైనింగ్ పూడ్చివేశారని విమర్శించారు. ఐబీఎం, మైనింగ్ శాఖ ప్లానింగ్ అనుమతులు లేకుండా ఖనిజ నిక్షేపాలు ఉన్న ప్రాంతాన్ని ఇలా మట్టితో పూడ్చడానికి అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించారు. మంగంపేటలో మైనింగ్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన 750కి పైగా కుటుంబాల ఉద్యోగులు, వేలాది మంది కార్మికులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మైనింగ్ 2-3 ఏళ్లలో మూతపడుతుందని ప్రచారం చేస్తూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి, ఖనిజ నిక్షేపాలపై నిజాయితీగా అధ్యయనం చేసి మైనింగ్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి పూడ్చిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పాటు ప్రాణాలైనా అడ్డుపెట్టి మైనింగ్‌ను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## అసాంఘిక కార్యకలాపాలపై
# పోలీసుల డ్రోన్ కెమెరా కన్ను



**చిట్వేలి** చిట్వేలి మండలంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రైల్వే కోడూరు గ్రామీణ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టారు. చిట్వేలి మండలంలోని మల్లెంపల్లి, జెట్టివారిపల్లి, తుమ్మకొండ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల శివారు ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాలలో డ్రోన్ కెమెరాలను ఎగురవేసి విస్తృతంగా నిఘా నిర్వహించారు. ముఖ్యంగా పేకాట స్థావరాలు, కోడి పందేలు నిర్వహించే ప్రాంతాలు, గంజాయి నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద ప్రదేశాలు, బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రోన్ నిఘా ద్వారా అనుమానాస్పద కదలికలు, ప్రదేశాలు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసు సిబ్బంది స్పందించి, పరిస్థితులను పరిశీలించి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా అవసరాన్ని బట్టి డ్రోన్ నిఘాను విస్తరించి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు చేపడతామని ఆయన అన్నారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు, గంజాయి వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# ప్రజావాణికే రాని ఆర్డీవో..

## ప్రజల సమస్యలు ఎలా తీరుతాయి? బి సిపిఎం

- గజ్వేల్ డివిజన్‌లో విద్య, వైద్యం, రైతు సమస్యలు పరిష్కరించాలి
- రెండు నెలలుగా ప్రజావాణికి హాజరుకావడం లేదంటూ సీపీఎం ఆరోపణ




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికే రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రశ్నించారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయం, నిర్వాసితుల సమస్యలతో పాటు పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. గజ్వేల్ ఆర్డీవో గత రెండు నెలలుగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావడం లేదని ఆరోపించారు. సాధారణ సమయాల్లోనూ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, కార్యాలయానికి సమస్యలపై వచ్చే ప్రజలను కలవడం లేదని అన్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజావాణికి హాజరుకాని ఆర్డీవోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సమస్యలే సమస్యలు పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు దాటినా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు, నోట్‌బుక్స్ అందలేదని ఎల్లయ్య అన్నారు. విద్యార్థుల మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

### నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీలు వెంటనే చెల్లించాలి

ట్రిపుల్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలను బాధిత ప్రజలకు వెల్లడించాలని, భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ పరిధిలో భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, పేదలకు పెండింగ్ ప్యాకేజీలు వెంటనే అందించాలని, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి. డివిజన్ పరిధిలోని పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జీవో నంబర్ 6 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అహ్మద్, మొగుళ్ల రాజు, కోనేరు ప్రవీణ్, గుండ్రు రాజు, గొల్లపల్లి ప్రవీణ్, అప్పల ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తు గడువు పెంపు.

- సెప్టెంబర్ 15 వరకు అవకాశం.
- దివ్యాంగులు, వృద్ధుల కోరిక మేరకు ప్రభుత్వ నిర్ణయం



**ములుగు(ప్రశ్నన్యూస్)** చేయూత పెన్షన్ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు గడువును ప్రభుత్వం మరో 15 రోజులు పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు తగిన సమయం లేదని విజ్ఞప్తులు రావడంతో గడువును సెప్టెంబర్ 15 వరకు పొడగించినట్లు పేర్కొన్నారు. ఈ పొడిగింపుతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఖర్గే సభ అనంతరం 'శుద్ధీకరణ'పై పోలీసులకు ఫిర్యాదు


- దళితుల గౌరవాన్ని కించపరిచే చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ అనంతరం అదే ప్రదేశంలో నిర్వహించిన 'శుద్ధీకరణ' కార్యక్రమంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ములుగు ఎస్సైకి కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు ఫిర్యాదు చేశారు. హల్ద్వానీలోని రామలీలా మైదానంలో ఆగస్టు 8న మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం అదే ప్రదేశంలో ఆగస్టు 10న 'శుద్ధీకరణ' పేరుతో హవన్, యజ్ఞం నిర్వహించడాన్ని కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చర్య దళితుల గౌరవాన్ని కించపరిచే విధంగా ఉందని వారు ఆరోపించారు. 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని సమర్థించిన ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్‌తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల నిరోధక చట్టం (ఎస్ సి /ఎస్ టి యాక్ట్ )తో పాటు వర్తించే ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ములుగు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు తూర్పుంటి రాజు ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు కావంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదు సమర్పించారు. దళితుల గౌరవం, రాజ్యాంగ హక్కులు, సామాజిక సమానత్వ పరిరక్షణ కోసమే ఫిర్యాదు చేసినట్లు తూర్పుంటి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు సిహెచ్. కనకరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సుతారి మహంకాళి, కజీర్ నర్సి, మల్లేష్, తాడెం ఐలయ్య, తాడెం నరేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు వెయ్యి రోజులు: పైడాకుల అశోక్

- 3500 రోజుల్లో కానిది 1000 రోజుల్లో సాధించాం - ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు



ములుగు(ప్రశ్న న్యూస్)తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి వెయ్యి రోజులు పూర్తయ్యాయి. కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమైన పాలనకు స్వస్తి పలికి, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనను అందిస్తున్నామని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలన మధ్య ఉన్న తేడాను వివరించారు. ప్రగతి భవన్ చుట్టూ కంచె తొలగించి ప్రజా భవన్ గా మార్చాం. సామాన్యుడికి తలుపులు తెరిచాం. అసెంబ్లీకి కూడా మొహం చాటేసిన పాలనకు భిన్నంగా ప్రజల గొంతుకను శాసనసభలో వినిపిస్తున్నాం" అని పేర్కొన్నారు.

### ఉద్యోగాల్లో విప్లవం.

3500 రోజుల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వలేదని, డీఎస్సీ కోసం యువత సంవత్సరాల తరబడి ఎదురుచూశారని అశోక్ విమర్శించారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రూప్-1 నియామకాలు, ఉపాధ్యాయ నియామక ప్రక్రియను వేగవంతం చేశాం. నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు నింపాం. వేల రోజులు అధికారంలో ఉండి యువతను నిరీక్షింపజేయడం ఒక పాలన. వచ్చిన కొద్ది కాలంలోనే నియామకాలు చేపట్టడం మరో పాలన" అని స్పష్టం చేశారు.

### రైతు, పేదలకు భరోసా.

రైతు రుణమాఫీ విషయంలోనూ గత పాలన కంటే మెరుగ్గా పనిచేశామని అన్నారు. "గతంలో లక్ష రూపాయల మాఫీకే ఏళ్లు పట్టింది. మేము అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే 2 లక్షల వరకు రుణమాఫీ చేశాం.

ఇది మాటలకు చేతలకు మధ్య ఉన్న తేడా అని తెలిపారు. ఆరోగ్య బీమా పరిమితి పెంపు, 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, వడ్డీలేని రుణాలు, పెండింగ్ రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం, ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు వంటి నిర్ణయాలు ప్రజా పాలనకు నిదర్శనమని వివరించారు. పైడాకుల అశోక్ మాటల్లోఇది కేవలం వెయ్యి రోజుల పాలన కాదు. మార్పుకు వెయ్యి రోజుల మైలురాయి. 3500 రోజుల్లో చేయలేనివి 1000 రోజుల్లో మొదలుపెట్టాం. ఇది ఇంకా మూడో వంతు పాలన మాత్రమే. ముందు ముందు యువతకు మరిన్ని ఉద్యోగాలు, రైతులకు మరిన్ని పథకాలు, పేదలకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అందిస్తాం అన్నారు.

# అద్దె చెల్లించడం లేదు అంటూ మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయానికి తాళం

- గత 3 ఏండ్ల నుండి అద్దె చెల్లించడం లేదని ఇంటి యజమాని ఆరోపణ
- కోర్టు నుండి నోటీసులు ఎక్సైజ్ శాఖ కు పంపినఅధికారులు స్పందించడం లేదని ఆరోపణ





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** అద్దె చెల్లించడం లేదు అంటూ మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయానికి ఆ ఇంటి యజమాని తాళం వేసుకున్నారు. మేడ్చల్ లోని ఎక్సైజ్ కార్యాలయం గత కొన్ని ఏండ్ల నుండి మేడ్చల్ పట్టణం లోని అద్దె భవనంలో కొనసాగుతుంది. అయితే గత మూడేళ్ల నుండి అద్దె చెల్లించడం లేదని ఆ ఇంటి యజమాని విఠల్ రెడ్డి ఆరోపిస్తున్నారు. అద్దె విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించకపోవడంతో విసిగి వేసారి చివరకు ఎక్సైస్ కార్యాలయంలోని సిబ్బందిని బయటకు పంపి మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయ భవనానికి తాళం వేసుకున్నాడు. ఈ సందర్భంగా ఇంటి యజమాని విట్టల్ రెడ్డి మాట్లాడుతూ తాను కొత్త భవనాన్ని ఎక్సైజ్ శాఖకు అద్దెకు ఇచ్చానని దానిని మెయింటైన్ చేయకపోవడంతో భవనం మొత్తం శిథిలావస్థకు చేరుకుందని ఆరోపించారు. పోనీ అద్దె అయినా సమయానికి ఇస్తున్నారంటే అది కూడా లేదని ఎక్సైజ్ శాఖలో ఉన్నత అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాలని అయినా ఫలితం లేకుండా పోతుందని ఆరోపించారు. నెలకు 7550 రావాల్సి ఉందని గత 36 నెలల నుండి అద్దె చెల్లించడం లేదని బాధితుడు విఠల్ రెడ్డి ఆరోపించారు. కోటి నుండి సైతం నోటీసులు పంపించిన స్పందించడం లేదండి దీనికి తోడు మెయింటెనెన్స్ సైతం తననే చేయించుకోవాలంటే బెదిరిస్తున్నారని ఆ ఇంటి యజమాని విటల్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

# భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కావలసిన భూ సేకరణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సోమవారం రాష్ట్రంలోని రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ కోసం భూసేకరణ, పనుల పురోగతి, డబ్లింగ్ పనులు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ తో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. రాష్ట్రంలోని ప్రధాన రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ, ఎప్పటివరకు పూర్తి చేస్తారు? స్టేషన్ల ఆధునీకరణ, పురోగతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు అవసరమైన భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి భూములను అప్పగించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి పనికి గడువు విధించాలని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పెద్దపీట

- వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యుడు మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్
- మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సభ్యుడు
- న్యాయబద్ధంగా వ్యవహరించాలి: మంత్రి ఫరూక్



**నంద్యాల(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమితులైన మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన భేటీలో నియామక ఉత్తర్వులు అందుకున్న సందర్భంగా మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోఆర్‌టీ నం. 107 ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా తనకు బాధ్యతలు అప్పగించడంపై మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్ ప్రభుత్వానికి, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. నూతన సభ్యుడికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుభాకాంక్షలు తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు వాటికి సంబంధించిన వివాదాల పరిష్కారంలో నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. పేదలు, మైనార్టీ వర్గాలకు న్యాయం జరిగేలా అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, వాటికి సంబంధించిన వివాదాల సత్వర పరిష్కారం వంటి అంశాల్లో ట్రిబ్యునల్ సభ్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ సుబ్లి, కర్నూలు ప్రభుత్వ ఖాజీ సలాం మౌలానా, చాబోలు ఇలియాస్, మునియార్ ఖలీల్, మిద్దె హుస్సేన్, అస్మద్దీన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం

- కమలా క్రిస్టియాన, డాక్టర్ జె. ఉమారాణి




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )**గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు కమలా క్రిస్టియాన, డాక్టర్ జె. ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. రాజారావు మాట్లాడుతూ.. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను, హాకీ క్రీడపై ఆయనకున్న ఆసక్తిని, దేశానికి సాధించిన పతకాలు, క్రీడారంగానికి అందించిన సేవలను వివరించారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జయరాజు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. విజేతలకు బహుమతుల ప్రదానంతెలుగు భాషకు సంబంధించిన సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థినులు, అధ్యాపకుల మాటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమంలో అర్చన, సరోజన, డాక్టర్ సరోజ, దీపిక, డాక్టర్ శ్రీలత కస్తూరి, డాక్టర్ బాలచంద్రం, డాక్టర్ సౌజన్య, శ్రీధర్, శ్యామ్, భాస్కర్, విజయ్, రమాదేవి, సిరాజ్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వెటర్నరీ వర్సిటీలో 'అక్రమాల' కలకలం

- నకిలీ సర్టిఫికెట్లు.. అక్రమ ప్రమోషన్లపై సమగ్ర విచారణకు డిమాండ్
- నిధుల మళ్లింపు ఆరోపణలపైనా దర్యాప్తు చేయాలి
- ఏజీ ఆడిట్ అభ్యంతరాలపై ప్రభుత్వం నిగ్గు తేల్చాలి
- రిజిస్ట్రార్‌ను తక్షణమే రీకాల్ చేయాలి: సీఐటీయూ




తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో అక్రమాలు, అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. నకిలీ సర్టిఫికెట్లు, అక్రమ ప్రమోషన్లు, నిధుల దారి మళ్లింపు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ తిరుపతి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. యూనివర్సిటీ ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలపై ఏజీ ఆడిట్‌లో అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సీఐటీయూ పేర్కొంది. కొన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కోర్టు వ్యవహారాలు, తీర్పులు ఉన్నప్పటికీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించింది. ఏవో వేము రాజేశ్వర్‌రెడ్డి సమర్పించిన డిగ్రీ సర్టిఫికెట్‌పై ఆడిట్ అభ్యంతరాలు, బాల కార్తిక నారాయణరావు సర్టిఫికెట్‌కు సంబంధించిన అభ్యంతరాలు, జి. చంద్రశేఖర్, డి. కిరణ్‌ల కారుణ్య నియామకాలకు సంబంధించిన రికార్డులపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ కోరింది. అదేవిధంగా మాజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్. రామ్మోహన్‌రావు హయాంలో ప్రైవేట్ ఖాతాలకు నిధులు మళ్లించారనే ఆరోపణలు, వై. శేషుబాబు, ఎల్. కృష్ణకుమార్‌లకు ఒకే పనికి రెండుసార్లు చెల్లింపులు జరిగాయనే ఆరోపణలు, డమ్మీ ఏజెన్సీల ద్వారా నిధుల మళ్లింపు ఆరోపణలపైనా పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని పేర్కొంది. ఈ వ్యవహారాలకు సంబంధించి కోర్టు తీర్పు కారణంగా సుమారు రూ. 45 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిన అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ప్రజాధనానికి సంబంధించిన వ్యవహారాల్లో అసలు ఏం జరిగిందో వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. యూనివర్సిటీలో జరుగుతున్నాయని పేర్కొంటున్న అక్రమాలపై పలుమార్లు రిజిస్ట్రార్‌తో పాటు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని సీఐటీయూ ఆరోపించింది. తీవ్రమైన ఆరోపణలు, ఆడిట్ అభ్యంతరాలు ఉన్నప్పటికీ యాజమాన్యం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. విచారణ పూర్తయ్యే వరకు కీలక బాధ్యతల్లో ఉన్న అధికారులపై తగిన పరిపాలనా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రస్తుత రిజిస్ట్రార్‌ను తక్షణమే రీకాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణకు ఆదేశించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని జిల్లా అధ్యక్షుడు ఎస్. జయచంద్ర, ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం హెచ్చరించారు.

# శ్రీశైలంలో నీరు.. సీమలో కరువు

- సాగు, తాగునీటి కోసం నంద్యాల కలెక్టరేట్ ముట్టడి
- వైసీపీ ఆధ్వర్యంలో 'చలో కలెక్టరేట్'



నంద్యాల(ప్రశ్న న్యూస్ )ఒకవైపు శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు.. మరోవైపు రాయలసీమలో సాగు, తాగునీటి కోసం రైతులు, ప్రజల అల్లాడుతున్న పరిస్థితి. వర్షాభావంతో చెరువులు, కుంటలు ఎండిపోతుండగా పంట పొలాలు బీళ్లువారుతున్నాయని ఆరోపిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాలలో ఆందోళనకు దిగింది. సాగు, తాగునీరు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేపట్టిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమంతో నంద్యాల కలెక్టరేట్ పరిసరాలు హోరెత్తాయి.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నేతృత్వంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'రైతులకు నీరు ఇవ్వాలి.. ప్రజలకు తాగునీరు అందించాలి' అంటూ నినాదాలు చేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారికి రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.శ్రీశైలం ప్రాజెక్టులో నీరు నిల్వ ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని శిల్పా రవి ప్రశ్నించారు. నీరు లేక చెరువులు, కుంటలు ఎండిపోయాయని, పంటలు బీళ్లువారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పి.పి. నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామలింగారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళారెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తంరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసీపీ నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మాబునిషా, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, నంద్యాల, గోస్పాడు మండలాల రైతులు పాల్గొన్నారు.

# రోశయ్య.. రాజకీయ విలువలకు ప్రతిరూపం

- విశాఖలో మాజీ సీఎం కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'గా గుర్తుండాలి: మంత్రి నారా లోకేశ్



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్ ) రాజకీయ విలువలు, క్రమశిక్షణ, నిజాయతీ, సబ్జెక్టుపై పట్టు, వ్యక్తిగత గౌరవానికి మారుపేరుగా మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య నిలిచారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నం సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రోశయ్యతో తన అనుబంధాన్ని, ఆయన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు.రోశయ్య విగ్రహాన్ని లిలి'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'లిలిగా పిలుద్దామని మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేసి 'స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్'గా పిలుచుకుంటున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో రోశయ్యను తలచుకోగానే 'స్టేట్స్‌మన్' గుర్తుకు వచ్చేలా ఆయన విగ్రహానికి ఆ పేరు ఉండాలని అన్నారు.

# దివ్యాంగుల స్వయం సమృద్ధికి 'స్కూటీ' భరోసా

- 51 మంది దివ్యాంగులకు ఉచిత త్రిచక్ర మోటార్ వాహనాలు
- ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత త్రిచక్ర మోటార్ వాహనాలు వారికి అండగా నిలవనున్నాయి. విశాఖ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం 51 మంది దివ్యాంగులకు స్కూటీలను ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత పంపిణీ చేశారు. జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో మూడు చక్రాల మోటార్ వాహనాలను అందిస్తోంది. ఒక్కో వాహనం విలువ సుమారు రూ.1.02 లక్షలు. 2025-26 సంవత్సరానికి విశాఖ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 60 వాహనాలు మంజూరయ్యాయి. మొత్తం 79 దరఖాస్తులు రాగా.. అర్హత ఆధారంగా జిల్లా ఎంపిక కమిటీ 51 మందిని ఎంపిక చేసింది.విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 10 చొప్పున 1,750 మోటార్ స్కూటీలను దివ్యాంగులకు అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టిందన్నారు.దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, టిడ్కో ఇళ్లలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో గృహాల కేటాయింపు, సుమారు 370 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

# మల్లన్న సన్నిదీలో గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామివా రిని దర్శించుకున్నసమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఉదయం శ్రీశైలం చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికి మర్యాదలు ఉభయ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి అమ్మవార్ల దివ్య దర్శనం చేసుకున్న మంత్రి పార్థసారధి మంత్రికి వేదమంత్రోచ్ఛారణలతో వేదాశీర్వచనం అందించి,తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ అర్చకులు.

# విశాఖకు 'ఏఐజీ'.. వైద్య రంగానికి భారీ ఊతం

- రూ.2 వేల కోట్ల పెట్టుబడితో అత్యాధునిక ఆసుపత్రి
- వెయ్యి పడకల సామర్థ్యం
- 9 వేల మందికి ఉపాధి
- ఎండాడలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్
- 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్.. 50కిపైగా ప్రత్యేక వైద్య విభాగాలు



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్ ) విశాఖ వైద్య రంగానికి మరో భారీ ఊతం లభించింది. ఆసియాలో ప్రముఖ వైద్య సంస్థగా పేరొందిన ఏఐజీ హాస్పిటల్స్ నగరంలో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఆనందపురం మండలం ఎండాడలో రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఏఐజీ హాస్పిటల్స్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డితో కలిసి భూమిపూజ నిర్వహించారు.విశాఖలో ఏఐజీ ఆసుపత్రి ఏర్పాటుతో వైద్య రంగంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరగనున్నాయి. సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ప్రాజెక్టు ద్వారా సుమారు 9 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ వెల్లడించింది. దీంతో విశాఖలో వైద్య రంగానికి అనుబంధంగా ఉపాధి, సేవా రంగాలు కూడా విస్తరించే అవకాశం ఉంది.ఏఐజీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయిన తర్వాత వెయ్యి పడకల సామర్థ్యంతో సేవలు అందించనుంది. తొలి దశలో 650 పడకలతో ఆసుపత్రిని నిర్మించి 2028 అక్టోబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో మరో 350 పడకలను ఏర్పాటు చేయనున్నారు.ఆసుపత్రి కోసం 9 ఎకరాల్లో ప్రధాన క్యాంపస్‌ను నిర్మించనున్నారు. మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నారు. ఆసుపత్రి, నర్సింగ్ విద్య, వైద్య శిక్షణ, పరిశోధన వంటి కార్యకలాపాలను సమన్వయం చేస్తూ ఒక సమగ్ర వైద్య ఆరోగ్య కేంద్రంగా క్యాంపస్‌ను తీర్చిదిద్దనున్నారు.హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్‌లో అందిస్తున్న వైద్య సేవల స్థాయిని విశాఖలోనూ అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి, వాటి పరిధిలో 50కిపైగా వైద్య ప్రత్యేక విభాగాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన వైద్య చికిత్సల కోసం ఉత్తరాంధ్ర ప్రజలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఏఐజీ వంటి అత్యాధునిక వైద్య సంస్థ విశాఖలో అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంది. వివిధ ప్రత్యేక వైద్య విభాగాలు ఒకే చోట అందుబాటులోకి రావడంతో విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి.వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలతో ఇప్పటికే వైద్య రంగంలో విశాఖ కీలక కేంద్రంగా ఎదుగుతోంది. ఇప్పుడు ఏఐజీ హాస్పిటల్స్ వంటి ప్రముఖ సంస్థ భారీ పెట్టుబడితో రావడం నగరానికి మరింత బలాన్నివ్వనుంది. వైద్య సేవలతో పాటు నర్సింగ్ విద్య, పరిశోధన, వైద్య సాంకేతికత, అనుబంధ ఆరోగ్య సేవలు విస్తరించేందుకు ఇది దోహదపడే అవకాశం ఉంది.ఏఐజీ విశాఖ క్యాంపస్‌ను కేవలం చికిత్స అందించే ఆసుపత్రిగా కాకుండా సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా తీర్చిదిద్దనున్నారు. రోగులకు వైద్య సేవలతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలు, వైద్య సిబ్బందికి శిక్షణ, పరిశోధనకు అవసరమైన వసతులు ఒకే ప్రాంగణంలో ఉండేలా ప్రణాళిక రూపొందించారు.ఎండాడలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహారం పేద కుసుమాలకు మణిహారం

- మంచిర్యాల జిల్లా కేంద్రంలో అత్యాధునిక మెగా కిచెన్
- ప్రెసిడెంట్ ప్రభూజీతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- హాజరైన హరేకృష్ణ ప్రతినిధులు , వేలాది విద్యార్థులు , అధికారులు





**మంచిర్యాల** ( ప్రశ్న న్యూస్ ) మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించే సెంట్రలైజ్డ్ కిచెన్ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీమాన్ సత్య గౌర చంద్రదాస ప్రభూజీతో పాటు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి కిచెన్ ప్రారంభించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోనే మంచిర్యాలలో పాత వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో 4వ కిచెన్ ప్రారంభమైంది. అనంతరంపద్మ నాయక ఫంక్షన్ హాల్ లో ప్రెసిడెంట్ సత్య గౌర చంద్రదాస ప్రభూజీ, కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అల్పాహారం చేస్తూ వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రెసిడెంట్ ప్రభూజీ మాట్లాడారు.

### మంచిర్యాలలోనే భారీ కిచెన్ : ప్రెసిడెంట్ ప్రభూజీ

తెలంగాణలో ఇప్పటికే తాము మూడు అత్యాధునికమైన సెంట్రలైజ్డ్ వంటశాలలు ఏర్పాటు చేశామని , మంచిర్యాలలో నాలుగోది ఏర్పాటు చేశామని , అది ఇవాళ ప్రారంభమైందని చెప్పారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన కిచెన్ మంచిర్యాలలోనే ఉందని తెలిపారు. సుమారు 50 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం నాణ్యమైన అల్పాహారాన్ని వేడిగా వడ్డిస్తామని స్పష్టం చేశారు. మంచిర్యాలతో పాటు పెద్దపల్లి , జగిత్యాల జిల్లాలోని పలు మండలాలకు ఈ అల్పాహారం పంపిణీ ఉంటుందని చెప్పారు. ఈ సేవ చేసేందుకు తమకు అవకాశం కల్పించి , ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు క్యాబినెట్ సభ్యులకు , స్థానిక ఎమ్మెల్ ప్రేమ్ సాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్ సహా జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభూజీ హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించొని చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో అత్యాధునిక సాంకేతికత, పరిశుభ్రమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం అభినందనీయమైన కార్యక్రమమన్నారు. ఏ బిడ్డా అర్ధాకలితో బడికి వెళ్లకూడదన్నదే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ సంకల్పం. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు.మానవ వనరులే రాష్ట్ర సంపద. సానబెట్టిన వజ్రాల్లా ప్రతి విద్యార్థిని తీర్చిదిద్ది ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకెళ్లాలన్నదే మా లక్ష్యం అని చెప్పారు. కేవలం ముప్పై రోజుల్లోనే ఈ కిచెన్ రూపుదిద్దుకుంది. దీనికి కావలసిన అన్ని వసతులు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వేగంగా ఏర్పాటు చేశారు. ప్రత్యక్షంగా తానే 4 సార్లు కిచెన్ నిర్మాణాన్ని పర్యవేక్షించారు. ఈ కిచెన్ ఏర్పాటుతో వేలాది మంది విద్యార్థులకు కడుపునిండా అల్పాహారం తీసుకుని ఆరోగ్యంతో చదువు మీద దృష్టి పెట్టగలుగుతారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది. మా కృషి ఫలిస్తుంది. తల్లిదండ్రుల ఆశలు నెరవేరుతాయి. శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ ప్రెసిడెంట్ , హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్. మంచిర్యాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చింది.హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో అత్యాధునిక సాంకేతికత, పరిశుభ్రమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా ప్రతి రోజు దాదాపు 50 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం అభినందనీయమైన కార్యక్రమం. ఏ బిడ్డా అర్ధాకలితో బడికి వెళ్ళకూడదన్నదే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ సంకల్పం.

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు , మంచిర్యాల.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ శ్రీమాన్ కౌంతేయ దాస ప్రభూజీ, సీపీఆర్ఓ, శ్రీమాన్‌రవిలోచన దాస ప్రభూజీ, సింగరేణి సంస్థ తరుపున ఇద్దరు జీఎంలు, డీసీపీ భాస్కర్ , మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ , మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణీ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రాముగిరి బానేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ తూముల నరేష్ , కార్పొరేటర్లు పూదరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీష్మ ఫిష్ ఫ్రై డోర్‌స్టెప్ సప్లై సేవలు ప్రారంభం

- చేతి శ్రీనివాస్ గంగపుత్రను అభినందించిన టీజీఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



వరంగల్(ప్రశ్న న్యూస్) భీష్మ ఫిష్ ఫ్రై డోర్‌స్టెప్ సప్లై సేవలను ప్రారంభించిన చేతి శ్రీనివాస్ గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం (టీజీఎస్) రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అభినందించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ నాణ్యమైన చేపల వంటకాలను వినియోగదారులకు వారి ఇంటి వద్దకే అందించే విధంగా భీష్మ ఫిష్ ఫ్రై డోర్‌స్టెప్ సప్లై సేవలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యత రుచికి ప్రాధాన్యతనిస్తూ సేవలను అందించాలని ఆయన ఆకాంక్షించారు.యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగుతూ కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించుకోవడం అభినందనీయమని చేతి శ్రీనివాస్ గంగపుత్ర ప్రారంభించిన ఈ సేవలు విజయవంతంగా కొనసాగాలని రాజేష్ ఖన్నా గంగపుత్ర ఆకాంక్షించారు.భీష్మ ఫిష్ ఫ్రై డోర్‌స్టెప్ సప్లై సేవలు కావలసిన వారు చేతి శ్రీనివాస్ గంగపుత్రను 8106054344 చరవాణిలో సంప్రదించి గ్రేటర్ వరంగల్ మహా నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# గ్రామ పంచాయతీ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం



**చిట్వేలి** చిట్వేలి మండలం సి. కందులవారిపల్లి గ్రామంలో ప్రజలకు అవసరమైన వైద్య, పరిపాలనా సేవలను మరింత చేరువ చేసే దిశగా రెండు కీలక భవనాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.32 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని బాలు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్మించగా కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కే.కే. చౌదరి, పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు, కూటమి నాయకులతో కలిసి రైల్వే కోడూరు నియోజకవర్గం టిడిపి బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామంలోనే ప్రాథమిక వైద్య సేవలు లభించడం వల్ల చిన్నచిన్న అనారోగ్య సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు.విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడం వల్ల గ్రామ పరిపాలన మరింత సౌకర్యవంతంగా కొనసాగుతుందని వారు అన్నారు. పంచాయతీ కార్యాలయం ప్రజలకు ప్రభుత్వ సేవలు, స్థానిక పరిపాలనకు సంబంధించిన కార్యక్రమాలు అందించే ప్రధాన కేంద్రంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు పంచాయతీ వ్యవస్థ కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో లారీ సుబ్బరాయుడు, చిట్వేలి మాజీ ఎంపీపీ గుండయ్య నాయుడు, చిట్వేలి మండల టిడిపి అధ్యక్షుడు కాకర్ల నాగార్జున, డాక్టర్ శివప్రసాద్ గౌడ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

# 'కేజేక్యూ : కింగ్ జాకీ క్వీన్' మూవీ రివ్యూ!



'దసరా' సినిమాతో తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా రూపొందిన సినిమానే 'కేజేక్యూ : కింగ్ జాకీ క్వీన్'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమాకి, కిరణ్ కుమార్ దర్శకత్వం వహించాడు. పూర్ణచంద్ర తేజస్వి సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాలో కథానాయికగా 'యుక్తి తరేజా' మెరిసింది. ఈ నెల 7వ తేదీన విడుదలైన ఈ సినిమా, 28వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో అందుబాటులోకి వచ్చింది. 'పార్థ' (దీక్షిత్ శెట్టి) ఓ అనాథ. నగరంలో దిక్కుతోచక తిరుగుతున్న అతణ్ణి ఒక వ్యక్తి చేరదీస్తాడు. నగరంలో రెండు ముఠాల దందా నడుస్తూ ఉంటుంది. ఒక ముఠాకి నాయకుడు 'కమల్ దాస్' అయితే, మరొక ముఠాకి నాయకుడు 'మస్తాన్'. పార్థను చేరదీసిన వ్యక్తి, అతను మాఫియా ముఠాకి నాయకుడు కాగలడని నమ్ముతాడు. పార్థ బలాన్ని పెంచడం కోసం, కమల్ దాస్ కూతురుతో వివాహాన్ని జరిపిస్తాడు. దాంతో కమల్ దాస్ తన అధికారాలను పార్థకి అప్పగించి పక్కకి తప్పుకుంటాడు. పార్థకి నమ్మిన బంటులా జాకీ (శశి ఓదెలా) ఉంటాడు. అతనితో కలిసి మస్తాన్ ను లేపేయాలని పార్థ నిర్ణయించుకుంటాడు. అప్పుడే నగరంలో తనకి ఎదురులేని విధంగా దందాను కొనసాగించవచ్చని భావిస్తాడు. అదే సమయంలో పార్థకి సంబంధించిన ఒక ఫంక్షన్ లో ఆడిపాడటానికి హీరోయిన్ 'భార్గవి'( యుక్తి తరేజా)ను సంప్రదిస్తారు. ఆమె 'నో' చెప్పినప్పటికీ, పార్థ ఆమెను ఏమీ అనలేకపోతాడు. ఎందుకంటే తొలి చూపులోనే ఆమె మత్తులో ... అందాల మాయలో పడిపోతాడు. భార్గవిని చూస్తుండిపోవాలనే ఉద్దేశంతో, ఆమె సినిమాలకు పార్థ నిర్మాతగా మారతాడు. ఆమె చుట్టూనే తిరుగుతూ ఉంటాడు. తన భర్తలోని ఈ మార్పును ఆయన భార్య గమనిస్తుంది. పెద్ద మొత్తంలో 'జాకీ'కి సుపారీ ఇచ్చి, భార్గవిని లేపేయమని చెబుతుంది. ఆ విధంగా చేయడం వలన తన భర్త తనకి దక్కుతాడని అంటుంది. అప్పుడు జాకీ ఏం చేస్తాడు? భార్గవికి ఎలాంటి పరిస్థితి ఎదురవుతుంది? అటు మస్తాన్ .. ఇటు భార్గవి వైపు నుంచి పార్థకి ఎదురయ్యే పరిణామాలు ఎలాంటివి? అనేది కథ.తల్లి .. తండ్రి .. పరిసరాలు .. పెరిగిన వాతావరణం జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రేమ .. అభిమానం .. అనురాగం .. వీటికి అర్థం 'పార్థ'కి తెలియదు. అందుకు కారణం రక్తపాతం అతనిని రాక్షసుడిగా మార్చడమే. తనలోని కోరికను ప్రేమ అనుకుని అతను 'భార్గవి' వెంటపడతాడు. ఆమె నోటి వెంట నుంచి వచ్చిన 'నో' అనే మాట, అతనిలోని రాక్షసుడికి కోపం తెప్పిస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది.'మనం ఎంచుకున్న మార్గమే మన జీవితాలను నిర్దేశిస్తుంది' అనే కాన్సెప్ట్ తో నిర్మితమైన సినిమా ఇది. ఎవరూ ఆదరించని ఒక అనాథ యువకుడిని ఒక వ్యక్తి చేరదీస్తాడు. అతనికి పిల్లనిచ్చేవాళ్లను చూసి పెళ్లి చేస్తాడు. కండబలం ఉన్న అతని చుట్టూ ధనబలం చేరుతుంది. అనుచరవర్గం పెరుగుతుంది. అయితే ఒక హీరోయిన్ తనను తేలికగా తీసిపారేయడం .. అతని అహం దెబ్బతినడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ కొనసాగుతుంది. ఇక ఆ హీరోయిన్ పార్థను ఎందుకు పట్టించుకోలేదు .. ఆమె మనసులో ఎవరున్నారు? నగరంలో తన ముఠా పెత్తనమే చెల్లాలనే పార్థ కోరిక నెరవేరుతుందా లేదా అనే అంశాలతో సెకండాఫ్ కథ మలుపులు తీసుకుంటూ వెళుతుంది. అధికారంతో పాటు తాను మనసుపడిన అమ్మాయి ప్రేమను అతను పొందగలిగాడా లేదా? అనే సందేహాలతో సమాధానాలు వెతుక్కుంటూ ప్రేక్షకులు ఫాలో అవుతూ ఉంటారు. హైదరాబాద్ లో జరిగే రెండు మాఫియా ముఠాల మధ్య కొట్లాట. ఆ రెండు వర్గాల మధ్యలో నడిచే ఒక వన్ సైడ్ లవ్ స్టోరీగా ఈ సినిమా కనిపిస్తుంది. అధికారం కోసం .. అందుకు అవసరమైన ధనం కోసం .. అనుకున్నది సాధించడం కోసం మాఫియా ముఠాల మధ్య గొడవలు జరగడం, ఇక అమ్మాయిల విషయంలో ప్రాణస్నేహితుల మధ్య తేడాలు రావడం వంటి కథలు గతంలో చాలానే వచ్చాయి. అలాంటి ఒక రొటీన్ కథగానే ఇది కనిపిస్తుంది. ఎలాంటి ఆదరణ లేని ఇద్దరు అబ్బాయిలు, మాఫియా చట్రంలో చిక్కుకోవడం సహజంగానే అనిపిస్తుంది. అయితే ఒక స్టార్ హీరోయిన్ పాత్ర ధోరణి మాత్రం వాస్తవానికి చాలా దూరంగా అనిపిస్తుంది. తనని ప్రేమించమంటూ హీరోయిన్ భార్గవిని పార్థ బెదిరిస్తాడు. అతనికి దూరంగా ఆమె వెళ్లిపోవచ్చు. కానీ ఆమె అలా చేయకుండా పార్థపై రివేంజ్ ప్లాన్ చేస్తుంది. అతని స్నేహితుడిని వలలో వేసుకుంటుంది. ఇవన్నీ అనవసరమైన విషయాలుగా అసహనాన్ని కలిగిస్తాయి.ప్రధానమైన పాత్రధారులంతా బాగానే చేశారు. నగేశ్ ఫొటోగ్రఫీ ..పూర్ణచంద్ర తేజస్వి నేపథ్య సంగీతం .. కార్తీక్ శ్రీనివాస్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. తుపాకీతో అధికారాన్ని .. ధనాన్ని గెలుచుకోవచ్చు గానీ, మగువ మనసును గెలుచుకోలేము' అనే సందేశం ఈ కథలో కనిపిస్తుంది. అక్కడక్కడా హింస .. అభ్యంతరకర సన్నివేశాలు కలిగిన ఈ కంటెంట్, ఫ్యామిలీ ఆడియన్స్ కి దూరంగానే కనిపిస్తుంది.

# ఆమె వల్లే పేరు మార్చుకున్నా..



వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన బాధ్యతలనూ రెండిటినీ సమానంగా ఎంజాయ్ చేస్తుంటారు నటి కియారా అద్వానీ. పెళ్లి, ప్రెగ్నెన్సీ, పేరెంట్‌హుడ్.. ఇలా జీవితంలో ఎన్ని కొత్త దశలు వచ్చినా ఆమె కెమెరాకు బ్రేక్ ఇవ్వకపోవడానికి కారణం అదే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలోని ఆసక్తికరమైన అంశాలను కియారా వెల్లడించారు. 'మా అమ్మ టీచర్. నేనూ అమ్మలా టీచర్ కావాలనుకున్నా. కానీ నటిని అయ్యాను. డెస్టినీ అంటే అదే. నా అసలు పేరు ఆలియా. నేను ఇండస్ట్రీకి వచ్చేనాటికే అలియాభట్ పాపులర్. అందుకే పేరు మార్చుకోవాల్సి వచ్చింది. 'అంజానా అంజానీ' సినిమాలో ప్రియాంక చోప్రా పోషించిన 'కియారా' పాత్రంటే నాకెంతో ఇష్టం. అందుకే ఆ పాత్ర పేరునే నా పేరుగా మార్చుకున్నా. 'ఫగ్లీ'తో నా కెరీర్ మొదలైనా, 'ఎంఎస్ ధోని: ది అన్ టోల్డ్ స్టోరీ' చిత్రం నా కెరీర్‌ని మలుపు తిప్పింది. అందులో నేను పోషించిన 'సాక్షి' పాత్ర నన్ను స్టార్‌ని చేసింది. కెరీర్ అనేది కొన్నాళ్లు కొనసాగాలంటే ఫిట్‌గా ఉండాలి. అందుకే వర్కవుట్లు బోరింగ్ అయినా తప్పడం లేదు. ఫిట్‌నెస్ కోసం కిక్ బాక్సింగ్ లాంటివి కూడా చేస్తాను. యాక్షన్ సినిమాలు చేసేటప్పుడు ఆ ట్రైనింగ్ ఉపయోగపడుతుంది. ఖాళీ సమయాల్లో ఇంట్లో కూర్చొని బొమ్మలు గీస్తుంటా. నా బ్యాగ్‌లో ఎప్పుడూ ఓ బుక్, స్కెచ్ పెన్స్, పెన్సిల్స్ ఉంటాయి. అలాగే అమెరికన్ సిరీస్, సైకలాజికల్ థ్రిల్లర్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తా' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు కియారా అద్వానీ.

# 'తెల్లకాగితం'
## విడుదల అప్పుడే



'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు హర్ష్‌రోషన్, నక్షత్ర ఎంతో క్యూట్‌గా కనిపిస్తున్నారు. కురుస్తున్న వర్షపు చినుకులు, గొడుగులా అడ్డు పెట్టుకున్న అరిటాకు, నాయకానాయికల రొమాంటిక్ లుక్స్.. ఇవన్నీ ఎంతో సహజంగా.. సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచిందని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగాన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.

# తిరిగి షూటింగ్‌కు సిద్ధమైన రష్మిక



**ఇంట్లో గడిపిన రోజుల్ని మిస్సవుతా అంటూ పోస్ట్**

'పుష్ప' బ్యూటీ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న గాయం నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇటీవలే ఎదురైన తుంటి గాయం కారణంగా కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమె, త్వరలోనే తిరిగి కెమెరా ముందుకు రానున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంట్లో గడిపిన సరదా క్షణాలను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. "త్వరలోనే తిరిగి పనిలోకి వెళుతున్నాను. ఈ సమయాన్ని నేను కచ్చితంగా మిస్సవుతాను" అని రష్మిక తన పోస్టులో రాసుకొచ్చారు. విశ్రాంతి సమయంలో తాను కుటుంబంతో కలిసి ప్రార్థనలు చేయడం, సినిమాలు చూడటం, పజిల్స్ పూర్తి చేయడం, తన పెంపుడు జంతువులతో ఆడుకోవడం వంటి మధురమైన క్షణాలకు సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. కొద్ది రోజుల క్రితం 'మైసా' అనే తన కొత్త చిత్రం షూటింగ్ సమయంలో రష్మిక తీవ్రమైన తుంటి గాయానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు వైద్యులు విశ్రాంతిని సూచించారు. ఈ విరామం తనకు జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని ఇచ్చిందని రష్మిక గతంలో పేర్కొన్నారు. "గతంలో తీరిక లేకుండా పనిచేస్తున్నప్పుడు 'నెమ్మదించడం' అనేది భయంగా అనిపించేది. కానీ ఇప్పుడు విశ్రాంతి తీసుకున్నాక, ఆ హడావిడి జీవితమే భయంగా అనిపిస్తోంది. బహుశా ఇదే జీవితం కావచ్చు" అంటూ ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. రష్మిక తిరిగి కోలుకుని షూటింగ్‌కు సిద్ధం కావడం పట్ల ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "నువ్వు పూర్తిగా కోలుకుని మళ్లీ పనిలో చేరడం చాలా సంతోషంగా ఉంది" "నిన్ను మళ్లీ తెరపై చూసేందుకు ఎదురుచూస్తున్నాం" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఈ అప్‌డేట్‌తో ఆమె అభిమానులు తమ అభిమాన నటిని వెండితెరపై చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సందీప్ వంగా 'రోమాంచకం'
## ట్రైలర్‌కు అదిరిపోయే రెస్పాన్స్



'యానిమల్', 'అర్జున్ రెడ్డి' వంటి ఇంటెన్స్, వయొలెంట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, ఆయన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ నుంచి ఓ యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో యువ నటుడు సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, 'రోమాంచకం' మూవీ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఊహించినట్టుగానే, ఈ ట్రైలర్‌కు ప్రేక్షకులు, నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. సందీప్ వంగా బ్రాండ్‌కు పూర్తి భిన్నంగా, ఆహ్లాదకరమైన వినోదంతో ట్రైలర్ ఉండటంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. 'మేమ్ ఫేమస్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ట్రైలర్ చూస్తుంటే ఇదొక కలర్‌ఫుల్, ఎనర్జిటిక్ రొమాంటిక్ కామెడీ అని స్పష్టమవుతోంది. డేటింగ్ యాప్ స్టార్టప్ నడిపే హీరో, తన వ్యాపారం కోసం చేసే పరిశోధనలో భాగంగా చెన్నైకి చెందిన హీరోయిన్‌తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని స్నేహితుల గ్యాంగ్‌తో కలిసి చేసే పనులు కొన్ని అనూహ్య సంఘటనలకు దారితీస్తాయి. ఈ క్రమంలో వచ్చే కామెడీ, సంఘర్షణలు ఆసక్తికరంగా ఉన్నాయి. "రాస్తే రామాయణం... తీస్తే రోమాంచకం" అంటూ హీరో చెప్పే డైలాగ్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉండటంతో పాటు, నేపథ్య సంగీతం కూడా చాలా క్యాచీగా ఆకట్టుకుంటోంది. హింసకు తావు లేకుండా, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరించేలా ఒక క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచడంలో పూర్తిగా సక్సెస్ అయింది. ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# మనసును తాకే 'కాగితం పడవలు'



వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారం దర్శకుడు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మాతలు. సెప్టెంబర్ 18న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. 'ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రేమకథ ఉంటుంది. ఈ సినిమా చూస్తే వారివారి ప్రేమకథలు గుర్తొస్తాయి' అని దర్శకుడు తుకారాం తెలిపారు. సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు వర్ధన్, కృష్ణప్రియ ఆనందం వెలిబుచ్చారు. సెప్టెంబర్ 18న సినిమాను విడుదల చేస్తున్నామని, తప్పకుండా అందరూ మెచ్చే సినిమా అవుతుందని నిర్మాత అంజనప్ప నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా డీవోపీ రుద్రసాయి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: AIS నౌఫల్ రాజా.

# పుట్టబోయే బిడ్డకు 'సామ్రాజ్' పేరు..
## సమంత ఫన్నీ రియాక్షన్!



ప్రముఖ నటి సమంత ప్రస్తుతం గర్భవతి అన్న విషయం తెలిసిందే. సినిమాలకు తాత్కాలిక విరామం ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్న ఆమె, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో సంభాషిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా అభిమానులతో జరిపిన చిట్‌చాట్‌లో ఆమె చేసిన ఒక సరదా వ్యాఖ్య ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తమకు పుట్టబోయే బిడ్డ కోసం మంచి పేర్లను సూచించాల్సిందిగా సమంత తన అభిమానులను కోరారు. దీనిపై స్పందించిన ఒక అభిమాని, పాప పుడితే 'సమైరా' అని, బాబు పుడితే 'సామ్రాజ్' అని పేరు పెట్టాలని సూచించారు. సమంత, ఆమె భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుల పేర్లు కలిసొచ్చేలా ఆ అభిమాని ఈ పేర్లను ప్రతిపాదించడం విశేషం. ఈ సూచనపై సమంత తనదైన శైలిలో చమత్కారంగా స్పందించారు.
ముఖ్యంగా 'సామ్రాజ్' అనే పేరుపై బదులిస్తూ, "మన గురించి మనమే కాస్త ఎక్కువగా ఆలోచిస్తున్నట్లు అనిపించడం లేదా?" అంటూ నవ్వుతున్న ఎమోజీలతో రిప్లై ఇచ్చారు. తన పేరులోని 'సామ్', రాజ్ పేరులోని 'రాజ్' కలిపి పెట్టిన ఈ పేరు వినడానికి కాస్త ఆత్మస్తుతిలా ఉందన్న ఉద్దేశంతో ఆమె చేసిన ఈ వ్యాఖ్య నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గత జూన్ నెలలో తన ప్రెగ్నెన్సీ విషయాన్ని ప్రకటించిన సమంత, అప్పటి నుండి గర్భధారణకు సంబంధించిన తన అనుభవాలను పంచుకుంటున్నారు. ఇప్పటికే తాను 11 కిలోల బరువు పెరిగానని ఆమె ఇటీవలే వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ సరదా వ్యాఖ్య సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

# సిద్ధవటంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**- ఘనంగా వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల దేవస్థానం దత్తత దేవాలయమైన సిద్ధవట క్షేత్రంలోని శ్రీ కామాక్షీ సమేత సిద్ధవటేశ్వరస్వామి వారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది.గత మూడు రోజులుగా అంటే ఈ నెల 29వ తేదీ నుంచి వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, జపాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 8.00 గంటలకు వేదపారాయణలతో కార్యక్రమం ప్రారంభించి, నిర్ణయించిన సుముహూర్తం ఉదయం 10.51 నిమిషాలకు నూతన ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

### ధ్వజస్తంభం విశిష్టత..

ఆలయ వైభవాన్ని ప్రతిబింబించే ధ్వజస్తంభం ప్రతి ఆలయంలో ఉంటుంది. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయంలోని నాలుగు ముఖ్యమైన భాగాలైన గర్భగుడి, మూలమూర్తి, బలిపీఠం, ధ్వజస్తంభంలో ఇది ఒకటి. ఆలయంలో ఉత్సవాలు జరగాలంటే ధ్వజారోహణ తప్పనిసరి. ఆ ధ్వజారోహణకు ధ్వజస్తంభం అత్యంత అవసరం. ప్రతిష్ఠ అనంతరం ఎనిమిది దిక్కులా బలిహరణ, పూర్ణాహుతి, అవభృథం, మహదాశీర్వచనంతో కార్యక్రమాలు ముగిశాయి.ఈ కార్యక్రమానికి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, పలువురు స్థానిక ప్రముఖులు హాజరయ్యారు.

### ఆలయాల అభివృద్ధికి కృషి : ధర్మకర్తల మండలి అధ్యక్షులు

ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ సిద్ధవటం – జ్యోతి ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని, భక్తులు అధిక సంఖ్యలో ఈ ఆలయాన్ని సందర్శించేలా విస్తృత ప్రచారం కల్పిస్తామని అన్నారు.

### ఆగమం ప్రకారమే కైంకర్యాలు: ఈఓ యం. శ్రీనివాసరావు

అనంతరం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ సిద్ధవటం – జ్యోతి ఆలయాలు దేవస్థానం దత్తత తీసుకున్నప్పటి నుంచి ఆలయ కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారమే నిర్వహిస్తున్నామని, భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు వై. విజయకుమార్, వేదపండితులు గంటి రాధాకృష్ణశర్మ అవధాని, పలువురు వైదిక సిబ్బంది, అర్చకులు, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి యువత వలస

**- ఇతర పార్టీలకు చెందిన 60 మందికి పైగా యువకుల చేరిక**

**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఆకర్షణ అంటున్న యువ నాయకులు**



**(ప్రశ్న న్యూస్)** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి యువత మద్దతు పెరుగుతోంది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన 60 మందికి పైగా యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చైతన్యపురి డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద డివిజన్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఇతర పార్టీలకు చెందిన యువ నాయకులు మణికంఠతో పాటు ఆయన మిత్రులు, 60 మందికి పైగా యువకులు బీఆర్ఎస్ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా తోట మహేష్ యాదవ్ నూతనంగా పార్టీలో చేరిన యువకులకు స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆయన పేర్కొన్నారు.యువత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది యువకులు పార్టీలో చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలిక సంరక్షణ అందరి బాధ్యత

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**- బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఘనంగా రాఖీ వేడుకలు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రాఖీ పౌర్ణమి సందర్భంగా బేటీ బచావో -- బేటీ పడావో (దీదీదూ) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ తోపాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య, సమానత్వం మరియు సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలనే సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..బాలికల హక్కులు, భద్రత, విద్య భవిష్యత్ అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.రాఖీ వేడుకల ద్వారా అన్నాచెల్లెళ్ల అనుబంధంతో పాటు బాలికల భద్రత గౌరవాన్ని కాపాడాలనే సామాజిక బాధ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొని "బాలికలను రక్షిద్దాం -- బాలికలను చదివిద్దాం" అనే దీదీదూ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి,బాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం.. బీఆర్ఎస్ పాదయాత్ర..

- వెల్దుర్తి--పిల్లికొట్టాల డబుల్ రోడ్డుకు తక్షణమే నిధులు విడుదల చేయాలి..
- మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది..
- సునీతాలక్ష్మారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు.. డీఆర్వోకు వినతిపత్రం.





**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** మెదక్ జిల్లా వెల్దుర్తి--పిల్లికొట్టాల మధ్య డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల రవాణా కష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ పాదయాత్ర నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శివంపేట మండలం పోతులగూడెం నుంచి కలాన్ శెట్టిపల్లి వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి కార్ల ర్యాలీగా మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో అంబాదాసును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వెల్దుర్తి--పిల్లికొట్టాల రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం తదితర అవసరాల కోసం ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు.రహదారి పరిస్థితి అధ్వానంగా ఉండటంతో వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని అన్నారు. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.అనంతరం మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. వెల్దుర్తి--పిల్లికొట్టాల రహదారి నిర్మాణానికి కూడా నిధులు కేటాయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం మారిన అనంతరం పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో మంజూరైన నిధులను రద్దు చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. రహదారి నిర్మాణం నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వెల్దుర్తి--పిల్లికొట్టాల డబుల్ రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గతంలో మంజూరైన నిధులను పునరుద్ధరించి రహదారి నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలని కోరారు. రహదారి నిర్మాణంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.అనంతరం కార్ల ర్యాలీగా మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెల్దుర్తి--పిల్లికొట్టాల రహదారి ప్రస్తుత పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మంజూరైన నిధులను పునరుద్ధరించి డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకొని కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల తరఫున ఉద్యమాన్ని కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.పోతులగూడెం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలో వాహనాల తనిఖీలు

**- సి ఐ. జీవన్ గంగాధర్ బాబు**

**- మద్యపానానికి, దూమపానానికి , మాంస హారానికి చెక్**





**శ్రీశైలం (ప్రస్నన్యూస్)** శ్రీశైల దేవస్థానంలో మోట్టా మోధాటి సరిగ ముకద్వారం మరియు హటకేశ్వరం వద్ద వాహనాల పై ప్రత్యక్ష దృష్టి పెట్టలాని సి ఐ . జీవన్ గాంధర్ బాబు స్థానిక పోలీసులు కు, హోమ్‌గార్డ్స్ కు జిల్లా ఎస్పి అదేశాల మెరాకు పూర్తి భద్యతలు అప్పాగిన్చారు . ఈ చెక్ పాయింట్లు యాధవిధిగ కోనసగలని కోరుతు అలగే శ్రీశైలం, సుండిపెంటా గ్రామ ప్రజలకు విటిని దృష్టి లో వుంచుకోని పోలీస్ సిబ్బంధికి, హోమ్‌గార్డ్స్ కు దేవస్థాన సెక్యూరిటీ ఫోర్స్ కు సహక రించలాని విజ్ఞప్తి చెసారు.

# ప్రజలే కేంద్రంగా... ప్రగతే లక్ష్యంగా... 1000 రోజుల ప్రజా పాలన!

**- బుడ్డ భాగ్యరాజ్ మాజీ సర్పంచ్ డిసిసి కార్యదర్శి మెదక్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబ్బాక నియోజవర్గం ఇన్చార్జ్ దుబ్బాక టైగర్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణలో కొత్త పాలనా అధ్యాయం ప్రారంభమైంది.ఇందిరమ్మ ఇళ్లుగృహజ్యోతి -- ఉచిత విద్యుత్‌రైతు సంక్షేమం -- రైతు భరోసామహిళలకు ఉచిత బస్సుప్రయాణంసంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండవిద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యతఇవి కేవలం పథకాలు కాదు... ప్రజల జీవితాల్లో మార్పుకు బాటలు వేసే సంక్షేమ-- అభివృద్ధి కార్యక్రమాలు.రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.1000 రోజులు... ప్రజల కోసం చేసిన పనికి నిదర్శనం.. రాబోయే రోజులు... తెలంగాణ అభివృద్ధికి స్వర్ణయుగానికి నాంది!" పలుకుతుందని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శి బుడ్డ భాగ్యరాజ్ తెలిపారు.

# దొడ్లకొత్తూరులో సర్పంచ్ సుడిగాలి పర్యటన

**- పాఠశాల, అంగన్వాడీ, సెల్స్ డిపోను పరిశీలించిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు**



ఏటూరునాగారం(ప్రశ్నన్యూన్) గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు దొడ్లకొత్తూరు గ్రామ సర్పంచ్ ఆలం మానస--నాగార్జున్ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎఫ్ఏ, యువత, గ్రామస్తులు కలిసి సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, సెల్స్ డిపోలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 70 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, సుమన్ తెలిపారు. పాఠశాలలో మూడు కంప్యూటర్లు ఉన్నప్పటికీ కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉండటంతో వాటిని స్టోర్ రూమ్, కార్యాలయం, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులుగా వినియోగించుకోవాల్సి వస్తోందని వివరించారు.పాఠశాలలో అదనపు తరగతి గదులు, వాష్ బేసిన్ మైనర్ రిపేర్లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని సర్పంచ్‌ను కోరారు. దీనిపై సర్పంచ్ ఆలం మానస--నాగార్జున్ స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుతుండటం సంతోషకరమని అన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం సెల్స్ డిపోను పరిశీలించిన సర్పంచ్ అక్కడ పందికొక్కుల బెడదతో సమస్యలు ఉన్నాయని గుర్తించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన మైనర్ రిపేర్లు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించిన సర్పంచ్ అక్కడ అవసరమైన మైనర్ రిపేర్ పనులను పూర్తి చేయిస్తామని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎఫ్ఏ, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలి

**ఆత్మకూరు** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన సామాజికవేత్త ఢ సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు భారతదేశంలోని 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులందరూప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు(దరఖాస్తులు) చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత ఢ అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓటు అనేది ప్రతి ఒక్కరికి వజ్రాయుధమని అన్నారు. ఓటు హక్కు అనేది ఎవరిని ఎన్నుకోవాలి, ఎవరిని గద్దె దించాలనీ నిర్వహిస్తున్నారు. నమోదు చేసుకోవడానికి అర్హతలు 01 అక్టోబర్, 2008వ సంవత్సరం లేదా అంతకు ముందు జన్మించిన వారు ఓటు హక్కు కు అర్హులనీ అన్నారు. కావాల్సిన పత్రాలుఆధార్ కార్డు జిరాక్స్, జనన ధృవీకరణ పత్రం జిరాక్స్ /లేదా 10వ తరగతి(ఎస్ఎస్ సి) మార్క్ లిస్ట్ జిరాక్స్ / ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టిసి), 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, కుటుంబ సభ్యుల్లో ఒకరి ఓటర్ ఐడీ జిరాక్స్, మొబైల్ నంబర్ లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.గ్రామ / వార్డు సచివాలయంలో, మీ సేవ (ఓవవ ాావలజీ) కేంద్రంలో, ఔూఖ పోర్టల్: లిలిలి.నిలబజూ.తిని లో నమోదు చేసుకొని, ఆ రసీదు, మీ ఆధారాలు స్థానిక (బి ఎల్ వో)బూతు లెవెల్ ఆఫీసర్ కు గాని, స్థానిక (వీఆర్వో) విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ కు సమర్పించాలన్నారు. వారు పరిశీలన చేసి, ఎలక్షన్ (ఆర్వో)రిటర్నింగ్ ఆఫీసర్ కు పంపిస్తారన్నారు. అప్పుడు మనకు కొత్త ఓటు వస్తుందన్నారు.

# ఘనంగా నందమూరి సుహాసిని జన్మదిన వేడుకలు

**కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్)** తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసిని జన్మదిన వేడుకలు కూకట్ పల్లి లో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణా సంచాల కాల్చి మిఠాయి లు పంచి పెట్టారు. కార్యక్రమంలో అడక్ కమిటీ సభ్యురాలు ఉప్పల పద్మా చౌదరి,సీనియర్ నాయకుడు షేక్ సత్తార్ అట్లూరీ దీపక్,వెంకట శివయ్య,శాస్త్రి, కేతినేని చౌదరి,కేతినేని కిషోర్,చెరకూరి రవి సుబ్బారావు,ఉమా,రమాదేవి , కొల్లూరి శ్రీనివాస్, నాయుడు ,సాంబశివరావు, వడ్లమూడి శ్రీనివాసరావు పూర్ణ ,మదన్,పవన్ మార్నే, కొండలరావు,ఉగ్ర నరసింహ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



# మార్కెట్‌లో రైతన్న జాడేది.? రాహుల్ రాజ్

- బోయిన్ పల్లి మార్కెట్‌పై ఆకస్మిక తనిఖీలు - రెండేళ్ల క్రితం ఎలా ఉంది, ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రాహుల్ రాజ్ యార్డ్ అధికారులకు సూచన
- మార్కెట్ లో అన్నదాతలు లేరా,ఎవ్వరు కన్పించడం లేదు:రాహుల్ రాజ్ - బయో గ్యాస్ కేంద్రం పరిస్థితి భిన్నంగా ఉంది. - విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఎదురౌతున్నాయా.?
- ఉన్నతాధికారితో అసోసియేషన్ మొరచాంతాడంత లిస్టుతో ఆవేదన వ్యక్తంచేశారు.? - సార్ యార్డ్ కాదు.? ఖరీదు దారుల పాలిటకన్నీటి రహదారులు, మార్కెట్ లో నిత్యం ప్రమాదాలే.
- హమాలీల గోస ఎవ్వరికీ పట్టడం లేదు సార్,మీరైనా మాకు న్యాయం చేయ్యండి. - మార్కెట్ యార్డులో చినుకు పడితే చిత్తడే.ఆర్థో (ఎముకల బాధలతో) సమస్యలతో అందరిలో దడ

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో అన్ని సమస్యలే, పట్టించుకునే నాథుడే లేడు. అధికారులకు తలనొప్పిగా మారిన బోయిన్ పల్లి మార్కెట్.యార్డులో మౌళిక సదుపాయాల కల్పనలో ప్రతి రోజూ రైతులు, కమీషన్ ఏజెంట్లు,ఖరీదు దారులు ఫిర్యాదుతో తలలు పట్టుకుంటున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం బోయిన్ పల్లి మార్కెట్ గా అవతరించినప్పటి నుంచి ఏమి ఇబ్బందులు తలెత్తలేదు.కానీ గత కొన్ని నెలలుగా మౌళిక సదుపాయాల విషయంలో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న మార్కెట్ కమీషన్ ఏజెంట్లు,ఖరీదు దారులు.కనీసం మరుగు దొడ్లని కూడా మరమత్తులు చేయకుండా అందరినీ కృత్రిమంగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




### గత ఏడాది నుంచి బిల్లులు రాక గుత్తేదారులు అడ్రస్ గల్లంతు.?

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత కొన్ని సంవత్సరాలుగా బోయిన్ పల్లి మార్కెట్ లో చెత్త చెదారం శుభ్రం చేయడానికి కాంట్రాక్ట్ తీసుకున్న గుత్తేదారులు. సర్కార్ నుంచి బిల్లులు రాక చెత్త కార్మికులకు వేతనాలు చెల్లించలేక, వడ్డిలకు తీసుకుని కాస్తోకూస్తో కార్మికులకు చెల్లించినప్పటికి తనకు న్యాయం జరగకపోవడంతో అయ్యా మీకు మీ కాంట్రాక్ట్ కు ఓ దండం అంటూ తమ ఆవేదనను అధికారులతో వ్యక్త పరుస్తూ యార్డ్ కు దూరం అవుతున్నారు. తద్వారా బయో గ్యాస్ కేంద్రానికి కూరగాయల వ్యర్థాలు తరలించక, యార్డులో ఎక్కడ పడితే అక్కడ కుళ్లిన కూరగాయల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.వీటి వల్ల బయో గ్యాస్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆగడంతో పాటు పలు రకాల సమస్యలు నెలకొన్నాయి.





### బోయిన్ పల్లి మార్కెట్ నీ ఆకస్మికంగా తనిఖీ చేసిన డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్ నిన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా ఆయన యార్డ్ ని పరిశీలించిన అనంతరం బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ని యార్డ్ లో ఎక్కడా అన్నదాతలు కానరావడం లేదని నిలదీశారు. అదిగాక మార్కెట్ లో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో రహదారులు నిండిపోయాయని,అసలు బోయిన్ పల్లి మార్కెట్ లో ఏం జరుగుతుందో తెలియాలని నిలదీశారు.అలాగే గత రెండేళ్ల క్రితం మార్కెట్ ఏ విధంగా ఉందో ప్రస్తుతం ఎలా ఉందో ఒకనివేదిక సమర్పించాలని ఆదేశించారు.మరో విషయం ఏమిటంటే వీలైనంత త్వరలో రెండో సారి మార్కెట్ కి వస్తానని డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రాహుల్ రాజ్ తెలిపారు.

### సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఆవేదన

సార్ మీకు దండం పెడుతాం మమ్మల్ని కాపాడండి.గత కొన్ని నెలలుగా బోయిన్ పల్లి మార్కెట్ లో ఈగలు,దొమలు,చెత్త చెదారం,చెత్త కేంద్రాల వద్ద దుర్గంధమైన దుర్వాసన వస్తుంది.వ్యాపారం చేయలేకపోతున్నట్లు తమ ఆవేదనను రాహుల్ రాజ్ తో పంచుకున్నారు. అలాగే మార్కెట్ కి రాకపోకలు సాగించే ఖరీదు దారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

### హమాలీలు సైతం వారి ఆవేదనను వ్యక్తం చేశారు

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత రెండు దశాబ్దాలుగా హమాలీ విధులు నిర్వహిస్తున్న తమకి సమస్యలు చూట్టు ముట్టి హాస్పిటల్ పాలు అవుతున్నట్లు హమాలీ సోదరులు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రాహుల్ రాజ్ కి స్థానిక సమస్యలను వివరించారు.వీటి వలన వారి ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణిస్తుందని వర్ష కాలంలో మరీ ముఖ్యంగా అనారోగ్యానికి గురైయ్యే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఇ.వెంకటేశం, యార్డ్ ఇంచార్జి మధురిక, సూపర్వైజర్లు మహ్మద్ ఖలీద్, మహ్మద్ రఫీ,జలజాక్షి, సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి,కార్యదర్శి ఆర్వీసీ చంద్రారెడ్డి,ఉపాధ్యక్షుడు మిర్యాల శ్రీనివాస్,హమాలీ నాయకులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఇళ్లపైకే హైటెన్షన్ కత్తి

- బిసర్వే లేకుండా, అభ్యంతరాలు పట్టించుకోకుండా లైన్ల ఏర్పాటు
- కాంట్రాక్టర్ పనులకే అధికారుల వత్తాసా.?
- బిఆకులవారి ఘనపురంలో గ్రామస్థుల ఆగ్రహం
- పేదల ఇళ్లే లక్ష్యంగా ఎందుకు.?
- బిప్రత్యామ్నాయ మార్గం ఉన్నా పట్టించుకోని అధికారులు







**ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్)** వందలాది కుటుంబాలు నివసిస్తున్న గ్రామంలో ప్రజల భద్రతను పక్కనపెట్టి హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయనే ఆరోపణలతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపురంలో ఉద్రిక్తత నెలకొంది.

ఇప్పటికే గ్రామంలో 33 కేవీ లైన్ ఉండగా, మరో కొత్త హైటెన్షన్ లైన్‌ను కూడా ఇళ్లకు అత్యంత సమీపంగా తీసుకురావడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సరైన సర్వే లేదు, స్థల పరిశీలన లేదు, ప్రభావిత కుటుంబాల అభిప్రాయం తీసుకోలేదని వారు ఆవేదన చెందుతున్నారు.

### కాంట్రాక్టర్ పనులే ముఖ్యమా.? ప్రజల ప్రాణాలే ముఖ్యమా.?

అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా కాంట్రాక్టర్ పనులు వేగంగా సాగుతున్నాయని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ మధ్య ఏమైనా అవగాహన ఉందా.? అనే అనుమానాలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలతో సమాధానం చెప్పాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

### సర్వే లేకుండా స్తంభాలు ఎలా.?

మా ఇళ్లకు ప్రమాదకరంగా దగ్గరగా లైన్లు వేస్తున్నారు. మా అభ్యంతరాలు ఎవరు వినాలి.? అధికారులు స్వయంగా పరిశీలించారా? అంటూ బాధిత కుటుంబాలు నిలదీస్తున్నాయి. ప్రభావిత కుటుంబాల వద్దకు వచ్చి పరిస్థితి చూడాల్సిన బాధ్యత ఉండగా, సమాచారం ఇవ్వకుండానే పనులు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

### పేదల ఇళ్లే టార్గెట్ అంటూ ఆగ్రహం

ఆకులవారి ఘనపురంలో ఎక్కువగా పేద, వెనుకబడిన, గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు ఆర్థికంగా బలహీనంగా ఉన్నారనే కారణంతోనే వారి అభ్యంతరాలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైటెన్షన్ లైన్ ఇళ్లకు దగ్గరగా వెళ్లడం వల్ల భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణం, మరమ్మతులు, ఆస్తి వినియోగంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

### ప్రత్యామ్నాయం ఉన్నా ఎందుకు వద్దు.?

ప్రధాన రహదారి వెంట, ఇళ్లకు దూరంగా ఉన్న ప్రభుత్వ భూముల ద్వారా లేదా సాంకేతికంగా సాధ్యమైన ఇతర మార్గాల్లో లైన్ వేసే అవకాశం ఉన్నా, దాన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. "ప్రజల ఇళ్లను తప్పించి లైన్ వేయడానికి అవకాశం ఉన్నప్పుడు అదే మార్గాన్ని ఎందుకు ఎంచుకోవడం లేదు.?" అన్నది ఇప్పుడు గ్రామంలో ప్రధాన ప్రశ్నగా మారింది.

### ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్.

గ్రామస్థుల ఆరోపణలపై బాధ్యులైన అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు. ప్రజల అభ్యంతరాలను నమోదు చేయకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించకుండా పనులు కొనసాగించడానికి ఎవరు అనుమతించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.కాంట్రాక్టర్‌కు సంబంధించి పనుల అనుమతులు, మార్గం ఎంపిక, సాంకేతిక సర్వే, భద్రతా ప్రమాణాలను ఉన్నతాధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు తేలితే అధికారులతో పాటు కాంట్రాక్టర్‌పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### అభివృద్ధికి అడ్డు కాదు.. కానీ

విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు. మండలానికి ఉపయోగపడే సదుపాయాలను స్వాగతిస్తాం. కానీ ప్రజల ఇళ్లకు ఇబ్బంది కలిగించే మార్గం వద్దు. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోండి. కాంట్రాక్టర్ పని పూర్తిచేయడం కోసం మా ఇళ్ల భద్రతను పణంగా పెట్టకండి" అని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.ముందుగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభావిత కుటుంబాల అభ్యంతరాలను లిఖితపూర్వకంగా స్వీకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించిన తర్వాతే పనులు కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల అభ్యంతరాలను పక్కనపెట్టి పనులు కొనసాగిస్తే బాధ్యత ఎవరిది.? కాంట్రాక్టర్‌దా.. అధికారులదా.? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఉన్నతాధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి వాస్తవాలను పరిశీలించి, నిష్పక్షపాత విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పౌరసేవల్లో డేటా అనలటిక్స్


## - పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు.
రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో 'అవేర్' వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంతులేని యుద్ధం కాదు.. యుద్ధానికి ముగింపు కావాలి

## - పుతిన్‌తో మోదీ భేటీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు. ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో "ఇది యుద్ధాల యుగం కాదు" అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

# సింధు జలాల ఒప్పందం

## మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అధికారం ఆ కోర్టుకు లేదని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేసింది.ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ కోర్టును చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిందని భారత్ ఆరోపించింది. ఈ కోర్టును తాము ఎన్నడూ గుర్తించలేదని, దాని విచారణకు కూడా హాజరు కాలేదని తేల్చి చెప్పింది. "ఈ మధ్యవర్తిత్వ కోర్టుకు మా సార్వభౌమ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఏమాత్రం లేదు. ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఆ కోర్టు తీర్పులు మా చర్యలపై ఎలాంటి ప్రభావం చూపవు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి పాకిస్థాన్ కారణమని ఆరోపిస్తూ, ఆ దేశంపై తీసుకున్న కఠిన చర్యల్లో భాగంగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగినంత కాలం ఈ ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ స్పష్టం చేసింది. తాజా తీర్పుతో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, దేశీయంగా చేపడుతున్న జల ప్రాజెక్టులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండదని పునరుద్ఘాటించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588